# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

శనివారం 24 ఆగష్టు 2024


## రాయచోటి నియోజకవర్గం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి

**రాయచోటి, ఆగస్టు 23, ప్రభాతవార్త:**



రాష్ట్రంలోనే రాయచోటి నియోజకవర్గం అత్యంత వెనకబడిన ప్రాంతమని ఈ ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్‌కు శుక్రవారం రాజంపేట ఆర్అండ్‌బీ బంగ్లాలో వినతిపత్రం సమర్పించారు. గతంలో రాయచోటి నియోజకవర్గ ప్రజలకు తాగడానికి నీరు లేక నానా ఇబ్బందులు ఎదుర్కొనే వారని ప్రభుత్వం ఏర్పడిన తరువాత దాదాపు 20 బోర్ల వరకు వేసి నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ సమస్య అధికంగా ఉందని ఈ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు. ఇందుకు ఉప ముఖ్యమంత్రి రాయచోటి నియోజకవర్గం అభివృద్ధికి తమ వంతు బాధ్యతగా చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు.

## ఇసుకరీచ్‌ను సందర్శించిన జేసీ

**వీరపునాయునిపల్లె, ఆగస్టు 23, ప్రభాతవార్త ః**

మండలంలోని సంగమేశ్వర టెంపుల్ వద్ద ఉన్న ఇసుకరీచ్‌ను శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టరు అదితిసింగ్ సందర్శించారు. అక్కడ రికార్డులను పరిశీలించి ఏ విధంగా ఇసుక లోడింగ్ చేస్తున్నారు, తదితర విషయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు లక్ష్మిదేవి, ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# వరద ప్రభావిత గ్రామాల్లో పర్యవేక్షణ దారుణం

- ఉన్నత స్థాయి అధికారుల బృందాన్ని పంపుతాం
- నిర్వాసిత ప్రజల పక్షాన నిలుస్తాం
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్







**రాజంపేట అర్బన్, ఆగస్టు 23, ప్రభాతవార్త:**

చెయ్యేరు నది పరివాహక గ్రామాలకు జరిగిన నష్టం పూడ్చలేనిది. జలవిలయం సృష్టించిన దృశ్యాలు చూస్తుంటే హృదయ విదారకంగా కనిపిస్తోంది. వరద ప్రభావిత గ్రామాల ప్రజలకు ఉపశమనం కల్పించే విశయంలో గత ప్రభుత్వం విఫలమైంది. పర్యవేక్షణ దారుణంగా జరిగినట్లు తెలుస్తోంది అని ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ అన్నారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం పులపత్తూరు గ్రామాన్ని సందర్శించారు. 2021 నవంబర్ 19న అన్నమయ్య ప్రాజెక్టు దెబ్బదిన్న సమయంలో వచ్చిన వరదల కారణంగా ముంపుకు గురై నష్ట పోయిన ఐదు గ్రామాలలో ఒకటైన పులపత్తూరు గ్రామానికి విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రికి రాష్ట్ర పంచాయతీ రాజ్ కమీషనర్ మైలవరపు విఆర్ కృష్ణతేజ, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జేసి ఆదర్శ్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్లు నైదియా దేవి, మేఘస్వరూప్, తిరుపతి ఎమ్మెల్యే ఏ.శ్రీనివాసులు, రైల్వేకోడూరు ఎమ్మెల్యే ఏ.శ్రీధర్, టిడిపి జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్ రాజు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉప ముఖ్యమంత్రి వర్యులకు ఘణంగా స్వాగతం పలికారు. 2021 నవంబర్ నెలలో సంభవించిన వరదలను, వరద ప్రభావానికి గురైన ప్రాంతాలు(అప్పటి గూగుల్ మ్యాప్), తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్ట్, దెబ్బతిన్న ఇండ్లు, రోడ్లు, బ్రిడ్జిలు, ఆలయాలు, రెవెన్యూ, హౌసింగ్, ఆర్అండ్‌బి, జలవనరుల శాఖ, దేవాదాయ శాఖలు ఏర్పాటుచేసిన ఛాయాచిత్ర ప్రదర్శణ ద్వారా నష్ట వివరాలను జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాన్‌కి వివరించారు. ఛాయా చిత్ర ప్రదర్శణను నిశితంగా పరిశీలించిన ఉపముఖ్యమంత్రి నష్ట వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పులపత్తూరు గ్రామం, అరుంధతీ వాడ, హరిజనవాడలలో పవన్‌కళ్యాణ్ పర్యటించారు. వరదలలో దెబ్బతిన్న ప్రాంతాలను, ఇళ్లను, గ్రామ సమీపంలోని చెయ్యేరు పరివాహక ప్రాంతాన్ని, ప్రభుత్వం మంజూరు చేసిన ఇండ్లను, ఇంటి నిర్మాణాల ప్రగతిని పరిశీలించారు. ఈ సంధర్భంగా అక్కడి బాధితులతో మాట్లాడి నష్టం జరిగిన విధానాన్ని వివరాలను తెలుసుకున్నారు. గ్రామాలలో వరదలకు భూములు, ఇళ్లు, ఆస్థి ప్రాణ, పశు నష్టాలు జరిగి సర్వం కోల్పోయామని బాధితులు ఏకరువు పెట్టారు. దెబ్బతిన్న రోడ్లన్ని పునరుద్ధరించి సీసీ రోడ్లు వేయించాలని, వాగు వైపు రక్షణ గెడ ఏర్పాటుచేయాలని, వరద ప్రభావిత గ్రామాలలో నష్టపోయిన వారిని గుర్తించి పూర్తి స్థాయి పరిహారం అందించాలని, ఇప్పటికే కొంత పరిహారం తీసుకున్న వారికి కూడ పూర్తిగా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రాచీన చరిత్ర కలిగిన పాలేశ్వరి స్వామి టెంపుల్ పూర్తిగా కొట్టుకొని పోయిందని దానిని టీటీడీ లేదా ఎండోమెంట్ శాఖ ద్వారా పునరుద్ధరించాలని కోరారు. వరదలకు ముంపు గ్రామాలలో డ్వాక్రా రుణాలు, వ్యవసాయ రుణాలు తీసుకున్న వారికి పూర్తిగా రుణాలు మాఫీ చేస్తామని చెప్పారని, డ్వాక్రా రుణాలు మాఫీ చేశారే కాని, వ్యవసాయ రుణాలు మాఫీ చేయలేదన్నారు. పొలాలలో ఇసుక మేటలు వేశాయని, రెండున్నర సంవత్సరాలు పంటలు లేకుండా అలాగే ఉన్నామన్నారు. కొద్ది రోజుల క్రితం రైతులే స్వచ్ఛందంగా ఇసుక మేటలు తొలగించుకుని పంటలు వేసుకున్నామని వివరించారు. మాకు ఉన్న పంట రుణాలన్ని మాఫీ చేయాలని రైతులు ఉప ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. పులపత్తూరు, తొగురుపేటలలో ఐదు సెంట్లు స్థలం, ఐదు లక్షలు రూపాయలు ఇంటి నిర్మాణానికి మంజూరు చేశారు. అదేవిధంగా మందపల్లి గ్రామానికి కూడ మంజూరు చేయాలని, అధికారులు మందపల్లిని విజిట్ చేయాలని, వదల వల్ల నష్టపోయిన అన్ని గ్రామాల వారికి సమ న్యాయం చేయాలని, అలాగే వివిధ సమస్యలను గ్రామస్థులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రికి విన్నవించారు. అనంతరం పులపత్తూరు గ్రామంలో ఏర్పాటుచేసిన గ్రామ సభలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ జరిగినన్పటి నుంచి ఇప్పటి వరకు సరైన పర్యవేక్షణ కొరవడిందని అర్థమవుతోందని, మీ అందరి వేదన అర్థమవుతోంది. ఇలాంటి సంఘటలనపై హై లెవెల్ కమిటి వేసి పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయాల్సి ఉంది. ఇలాంటి వరదలు వచ్చినప్పుడు ఎవరూ నిర్లక్ష్యం వహించరాదని అన్నారు. లస్కర్ రామయ్య చాలా మంది ప్రాణాలు కాపాడినట్లు తెలిసి ఆయనను అభినందించి సన్మానం కూడ చేశాం. వరద ముందు ప్రాంతాల యొక్క ఫోటోలు, వీడియోలు చూశాను. తన ఆఫీస్ నుంచి దీన్ని ప్రత్యేకించి దృష్టి పెట్టి పర్యవేక్షణ చేస్తామని హామీ ఇచ్చారు. ఉన్నతాధికారుల బృందాన్ని గ్రామాలకు పంపిస్తాము. డ్యాము కూడ పునర్నిర్మాణం చేయాలని, ప్రాజెక్టు ఆధునికరించాల్సి ఉందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ ఇక్కడ 300మందికి ఇంటి నిర్మాణాలు చేయడం జరుగుతోందన్నారు. ఇందుకు సంబంధించి ఇంకనూ ఆరు కోట్ల రూపాయలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అవి క్లియర్ చేయించడానికి ప్రభుత్వం ద్వారా చర్యలు తీసుకుంటామని ఉపముఖ్యమంత్రి వర్యులు తెలిపారు. ఎవరికైతే పశువులు ఎక్కువగా చనిపోయి తక్కువ నష్టపరిహారం వచ్చిందో, పశుసంవర్ధక శాఖ నుండి డేటా తీసుకొని వారికి కూడ పరిష్కారం చేయడానికి చర్యలు తీసుకుంటాం. వీటితో పాటు కొద్దిమందికి మాకు అసలు ఎలాంటి నష్టపరిహారం అందలేదని, మమ్మల్ని నిర్లక్ష్యం చేశారని పేర్కొంటున్నందున, డేటాను తీసుకొని డిప్యూటి సీఎం వేసిన టీం ద్వారా విచారణ చేసి వారికి కూడ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటా. అలాగే రక్షణ గోడ కావాలని అడుగుతున్నారు. దానికి కూడ క్షేత్రస్థాయిలో నివేదిక తీసుకొని ప్రభుత్వానికి నివేదిస్తాం. పొలాల్లో ఎక్కడైతే ఇసుక పేరుకుపోయ ఇందో ఎన్.ఆర్.ఎం కింద ఉపాధి హామీ ద్వారా పనులు చేపట్టి పూర్తిగా పొలాలన్ని సాగు చేపట్టేలా బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఎవరికైతే ఇంటి నిర్మాణం కొరకు ఐదు సెంట్లు కాకుండా తక్కువ వచ్చిందో విచారణ చేసి వారందరికి కూడ ఐదు సెంట్లు వచ్చేలా చర్యలు తీసుకుంటాంజ అన్ని గ్రామాలకు అధికారులు వస్తారు, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సంధర్భంగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు మాట్లాడుతూ వరదల అనంతరం టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పర్యటన సంధర్భంగా వరదల్లో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు 20లక్షల చొప్పున నష్ట పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారని ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించి సీఎం దృష్టికి తీసుకువెల్లి న్యాయం చేస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారమే గ్రామ సభ లక్ష్యం

**ప్రొద్దుటూరు, ఆగస్టు 23, ప్రభాతవార్త:**



రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారమే గ్రామ సభ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే నంద్యాల వరద రాజుల రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రొద్దుటూరు మండల పరిధిలోని సోములవారిపల్లె పంచాయతీ సర్పంచ్ మోపూరి ప్రశాంతి అధ్యక్షతన ఈశ్వర్ రెడ్డి నగర్ లోని రాముని దేవాలయ ఆవరణలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం గ్రామ పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని తెలిపారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటి సీఎం మరియు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్‌లు పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తూ 15వ ఆర్థిక సంఘం ద్వారా విడుదలైన నిధులను గ్రామ పంచాయతీలకు మంజూరు చేశారన్నారు. అంతే కాకుండా దేశభక్తి గ్రామీణ ప్రాంతాల నుండి బలంగా వినిపించాలన్న ఉద్దేశ్యంతో ఆగస్టు 15, జనవరి 26న జరిగే జెండా వందన పండుగకు మైనర్ పంచాయతీలకు పది వేలు, మేజర్ పంచాయతీలకు 25వేల రూపాయల నిధులను పెంచడం, గ్రామీణ ప్రాంత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి అర్థమవుతుందన్నారు. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధి జాతీయ ఉపాధి హామీ పథకం 2006లో ప్రారంభించిందని గ్రామీణ ప్రాంత ప్రజలు పనులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో పనులు కల్పిస్తూ తగిన వేతనాన్ని అందించడమే ఉపాధి హామీ పథకం ఉదేద్శం అన్నారు. అలాగే వ్యవసాయ రంగానికి ఉపాధి హామీ పథకం అనుసంధానం చేస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. సోములవారిపల్లె పంచాయతీ పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి పథకంపై ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం చెందారని అన్నారు. ఇప్పటి నుండి అయినా ఉపాధి హామీ పథకం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించి ప్రతి కుటుంబాన్ని ఉపాధి హామీ పథకంలో భాగస్వామ్యులను చేసేలా ప్రయత్నం చేయాలని అధికారులకు సూచించారు. సోములవారిపల్లె పంచాయతీ పరిధిలో చాలా మంది కూలీ పనులు చేసుకునే వారు ఉన్నారని ప్రతి ఒక్కరిని జాతీయ ఉపాధి హామీ పథకంలో చేర్చి జాబ్‌కార్డు మంజూరు చేయాలని ఆదేశించారు. గ్రామంలోని ప్రధాన సమస్యలను ప్రజల ద్వారా గుర్తించి పరిష్కారం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సభలు ఏర్పాటుచేసిందన్నారు. సోములవారి పల్లె పంచాయతీకి 40 నుండి 50లక్షల దాకా అంచనా వ్యయంతో పనులను గుర్తించాలని సూచించారు. అంతేకాకుండా రైతులకు అవసరమైన పాడి పరిశ్రమకు సంబంధించిన షెడ్లను ఉపాధి హామీ పథకం ద్వారా సబ్సిడీతో నిర్మాణాలు చేపడతారన్నారు. పాడి పరిశ్రమ ఉండి ఆసక్తి కలవారు సంబంధిత అధికారులను కలిసి సబ్సిడీని ఉపయోగించుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామ సభకు హాజరైన ప్రజల నుండి ఆయా ప్రాంతాలలోని సమస్యలను గుర్తించి ప్రధానంగా 11సమస్యలను గ్రామ సభ ఆమోదించింది. గ్రామ సభల ద్వారా ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. ముందుగా సంబంధిత అధికారులు జాతీయ ఉపాధి హామీ పథకం యొక్క ఉద్దేశాన్ని ఈ పథకం ద్వారా చేసే పనుల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ జుబేదా, పంచాయతీ కార్యదర్శి హరనాధ్, పశువైద్యులు డాక్టర్ బి.సరస్వతి, అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ తేజస్విని, మాజీ సర్పంచ్ సాంబశివుడు, స్థానిక టిడిపి నాయకులు బాల, కుమార్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

### పల్లెలు పచ్చగా కళకళలాడేలా

## ప్రణాళికలు చేపట్టిన కూటమి ప్రభుత్వం





**పీలేరు, ఆగస్టు 23 ప్రభాతవార్తః**

గ్రామాల సుస్థిర అభివద్ధి దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులేస్తుందని పల్లెలు పచ్చగా కళకళలాడేలా గ్రామ పంచాయతీలు అభివద్ధి పథంలో నడిపించాలనే సంకల్పంతో స్వర్ణ గ్రామ పంచాయతీ పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి కూటమి ప్రభుత్వ శ్రీకారం చుట్టింది. ప్రజల భాగస్వామ్యంతో వారి అవసరాలను గుర్తించి పనులు చేపట్టాలన్న ప్రభుత్వ లక్ష్యం కోసం నిరసిస్తూ గ్రామసభలకు సమస్యలున్న వారే హాజరయ్యేలా చూడాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలో శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణంలో జరిగిన మొదటి స్వర్ణ గ్రామ పంచాయతీ గ్రామసభకు ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిధిగా విచ్చేసి మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీపథకం ద్వారా చేపట్టాల్సిన కొత్త పనులను ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల భాగస్వామ్యంతో ఎంపిక చేసి వాటిని చేపట్టాలన్నదే సీఎం నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజా ప్రతినిధులు నాయకులు పనులు చేపట్టడంతో మొదటి ప్రాధాన్యత ప్రజల అవసరాలు తీర్చడానికే ఇవ్వాలని, ఆతరువాతే తమ సొంత అవసరాలను చట్టపరంగా తీర్చుకోవాలని సూచించారు. నాయకులు ఎవరూ దౌర్జన్యాలకు కబ్జాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. ఈసందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తాగునీటి సమస్యలు, మురుగునీటి కాలువల నిర్మాణాలు, రోడ్డు నిర్మాణాలు తదితర సమస్యలపై సభాముఖంగా ఎమ్మెల్యే దష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే వాటి పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్దం చేయాలని అన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు, మరమ్మతులు కోసం వచ్చిన వినతులపై కూడా స్పందించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఎమ్మెల్యే పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి అభిమానంగా పలకరించారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారిణి ప్రసన్నకుమారి, ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి, తహశీల్దారు భీమేశ్వరరావు, సీఐ యుగంధర్, పంచాయతీ ఈఓ గురమోహన్ అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, గ్రామపంచాయతీ ఇన్‌చార్జి సర్పంచి జీనత్‌షఫీ, జిల్లా కోఆప్షన్ సభ్యులు ఎస్ఎండీ షఫీ, తెదేపా నాయకులు కోటపల్లె బాబురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, నారే సతీష్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, భూమిరెడ్డి, శరణ్‌కుమార్‌రెడ్డి, ఆతికాషఫీ, జనసేన నాయకులు సుధాకర్, బీజేపీ నాయకులు రమణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ పద్దతులను పరిశీలన

**ముద్దనూరు, ఆగస్టు 23, ప్రభాతవార్త:**

మండలంలోని రాజు గురువాయపల్లె గ్రామంలో సాగు చేసిన ప్రతి పంటను పరిశీలించి తదుపరి ప్రకృతి వ్యవసాయము ద్వారా సాగు చేప విధానాలను శుక్రవారం నాడు పరిశీలించినట్లు వ్యవసాయ అధికారి మారెడ్డి. వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విభాగంలో రాజుల రామసుధ ముద్దనూరు యూనిట్ ఇంచార్జ్‌గా పనిచేస్తూ తన పొలములో రెండు ఎకరాల విస్తీరణంలో నందిని పత్తి రకాన్ని సాగు చేసి అందులో సహాజ పద్ధతులను అవలంబించి రసాయనికి ఎరువుల వాడకం తగ్గించిచ సేంద్రియ పద్ధతులు అనుసరించి పంట సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పంట బెట్టకు గురి కాకుండా ద్రవ జీవామృతం తయారుచేసి తదుపరి తయారు చేసిన ద్రవ జీవామృతంను పంట పొలములో డ్రిప్పు ద్వారా కానీ లేదా నీటి కాలువల ద్వారా లేదా స్పేయర్ ద్వారా మొక్కలపై పిచికారి చేస్తే పంట బెట్టకు గురికాకుండా కాపాడుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రామ సుధ, భూపాల్ పాల్గొన్నారు.



## ప్రజల్లో భక్తి భావం పెంపొందుతుంది



**సంబేపల్లె, ఆగస్టు 23, ప్రభాతవార్త:**

ఆలయ నిర్మాణాలతో ప్రజల్లో భక్తి భావం పెంపొందుతుందని రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నారాయణరెడ్డిపల్లె గ్రామం పొన్నేరు వాండ్లపల్లిలో శ్రీశ్రీ గుర్రప్పస్వామి నూతన ఆలయ నిర్మాణ కార్యక్రమంలో భాగంగా ఆయన హాజరై ప్రసంగించారు. స్థానింగా ఉన్న ప్రజలు ఆయనకు అర్జీలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో నూరేకరాల గంగారెడ్డి, సుఖవర్ధన్‌రెడ్డి, ముదిరెడ్డి సుబ్బరాజు యాదవ్, భయ్యారెడ్డి, నాగిరెడ్డి, నాయకులు సిద్దారెడ్డి, హరిప్రసాద్, అమర్‌నాథ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రౌతుకుంట ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక వరలక్ష్మివ్రతం

**పులివెందుల. ఆగస్టు 23, ప్రభాతవార్త ః**

పులివెందులలోని అమ్మవారిశాలలో శుక్రవారం సామూహిక వరలక్ష్మివ్రతం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి మూలవిరాట్‌ను నిమ్మకాయలతో అలంకరించి భక్తులకు దర్శింపచేశారు. ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో కుంకుమార్చన, ప్రాకారోత్సవము, మహా మంగళహారతి, తదితర కార్యక్రమాలు నిర్వహించారు.



## గ్రామ సభలో పాల్గొన్న అధికారులు నాయకులు



**మైదుకూరు రూరల్, ఆగష్టు 23, ప్రభాతవార్త:**
మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం-ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమం లో భాగంగా ఈ రోజు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ గారి ఆదేశం గ్రామ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన అన్నలూరు గ్రామ పంచాయతీ సచివాలయం లో ఏర్పాటు చేసిన గ్రామ సభలో పాల్గొని అధికారులతో గ్రామ సమస్యలు, గ్రామ అభివృద్ధిపై చర్చించి అధికారుల, ప్రజల సహకారంతో త్రాగునీరు, సిమెంట్ రోడ్లు, డ్రైనేజి వ్యవస్థను పంచాయతిని అభివృద్ధి మాటలో చేసేలా సభలో చర్చించడం జరిగినది. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు మాజి సర్పంచ్ శీర్ల నాగమోహన్ యాదవ్, లింగందిన్నే చంద్ర ఓబుల రెడ్డి, ఏ.మధు సుధన్ రెడ్డి నారాయణ యాదవ్ రాజశేఖర్ రెడ్డి స్పెషల్ ఆఫీసర్, పంచాయతీ సెక్రటరీ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగినది.

## ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి

**చక్రాయపేట,ఆగష్టు 23,ప్రభాతవార్త:**
మండలంలోని ఓబులనేపల్లి సమీపంలో శుక్రవారం ఆటో బోల్తా పడి గంగారావు వాండ్ల పల్లెకు చెందిన చంద్రశేఖర్ ఎస్సై రంగారావు తెలిపారు మృతుడు చంద్రశేఖర్ రెడ్డి తన పొలంలో పండించిన కూరగాయలను వేంపల్లి మార్కెట్ కు తరలించి వాటిని అమ్ముకొని ఇంటికి బయలుదేరాడున్నాడు తాను వస్తున్న ఆటో డ్రైవర్ వేగంగా రావడంతో అదుపుతప్పి బోల్తా పడిందని చెప్పారు దీంతో తీవ్రంగా గాయపడి చెంద్రశేఖర్ రెడ్డిని వేంపల్లి కు తరలించి అక్కడ చికిత్సలు చేయించిన అనంతరం బంధువులు కడపకు తీసుకొని వెళుతువడగా మార్గమధ్యంలో చనిపోయాడన్నారు దీంతో మృతదేహాన్ని వేంపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోసుమార్టం చేయించినట్లు చెప్పారు కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదే చేసి దర్యప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించండి

**వేంపల్లె, ఆగస్టు 23, ప్రభాతవార్త ః**



వేంపల్లె గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరు తోడ్పాటు నందించాలని సర్పంచి ఆర్.శ్రీనివాసులు కోరారు. శుక్రవారం వేంపల్లె ఎంపీడీవో కార్యాలయ సభా భవనంలో గ్రామసభ నిర్వహించారు. వేంపల్లె గ్రామంలో ఆయా ప్రాంతాల నుండి అర్జీదారులు లిఖితపూర్వక అర్జీలు సమర్పించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం మండల వ్యాప్తంగా దాదాపు రూ.1.44కోట్ల మేర ఆయా పనులకు నిధులు మంజూరైనట్లు గ్రామసభ ప్రత్యేకాధికారి, పీఆర్ ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసులు వెల్లడించారు. వేంపల్లె గ్రామ పంచాయతీకి రూ.కోటి మేర పనులకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా వేంపల్లె పంచాయతీ పరిధిలోని ఆయా ప్రాంతాలకు సంబంధించి సీసీ రోడ్లు, కాంపౌండ్‌వాల్, మెటల్‌రోడ్లు, డ్రైనేజి, పారిశుద్ధ్యం, వీధిదీపాలు, మంచినీటి సరఫరా, తదితర అంశాలపై ప్రజాప్రతినిధులు, నాయకులు అర్జీలు సమర్పించారు. ఆయా శాఖల అధికారులు వారి శాఖల పురోగతి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో సుబ్బారెడ్డి, ఆయా శాఖల అధికారులు, టీడీపీ నాయకులు తెలంగాణ వలి, జబీల్లాహ్, వేమకుమార్, భద్ర, హుసేన్‌పీరా, షరీఫ్, భాస్కర్, ఫయాజ్, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, టీడీపీ, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నీతికి, నిజాయితికి నిలువుటద్దం టంగుటూరి ప్రకాశం

**వేంపల్లె, ఆగస్టు 23, ప్రభాతవార్త ః**



స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ టంగుటూరి ప్రకాశం పంతులు నీతికి, నిజాయితికి, నిర్భీతికి, నిరాడంబరతకు మారుపేరు అని ఏపీసీసీ మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో శుక్రవారం ప్రకాశం పంతులు 152వ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ స్వయం కృషి, స్వీయప్రతిభతో ఒక సామాన్యుడు, వారాలబ్బాయి, అసామాన్యుడు కాగలడని ఆయన నిరూపించారని తులసిరెడ్డి అన్నారు.

## ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలి

**వేంపల్లె, ఆగస్టు 23, ప్రభాతవార్త ః**



ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని వేముల ఎంపీడీవో శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. వేములలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ రామసుబ్బయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత బ్యాగులను ఎంపీడీవో శ్రీకాంత్‌రెడ్డి, ఎంఈవో2 రిఫిక్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కళాశాల దిశ, దశను మార్చేసిన ప్రిన్సిపల్ రామసుబ్బయ్యను కొనియాడారు. ఈ కళాశాలలో పదిమంది విద్యార్థులుండే వారని, ఈ సంఖ్యను 100మందికి పెంచినట్లు వారు తెలిపారు. చేసిన కష్టం ఎప్పటికీ వృథా కాదని, ప్రిన్సిపల్ రామసుబ్బయ్య నిరూపించారన్నారు. ప్రతి విద్యార్థి ఆయనను స్ఫూర్తిగా తీసుకుని లక్ష్యం నిర్దేశించుకుని సాధించాలన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాలికల వసతిగృహం ప్రారంభోత్సవం

**వీరపునాయునిపల్లె, ఆగస్టు 23, ప్రభాతవార్త ః**



వీరపునాయునిపల్లె మండల కేంద్రంలో శుక్రవారం కమలాపురం ఎమ్మెల్యే పుత్రా క్రిష్ణచైతన్యరెడ్డి బాలికల వసతిగృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15ఏళ్లుగా మూత వేసిన వసతిగృహాన్ని తమ ప్రభుత్వ హయాంలో తిరిగి ప్రారంభించడం తనకెంతో ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. భవిష్యత్తులో వసతిగృహానికి ప్రభుత్వ నిధులతో పక్కాగృహం ఏర్పాటు చేస్తామని తెలిపారు. అదే విధంగా విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం నుండి పిల్లలకు అందించాల్సిన అన్ని సౌకర్యాలను అందిస్తామని, విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరారు. ఈ వసతిగృహం తిరిగి ఏర్పాటు చేసేందుకు కృషి చేసిన వీఆర్ఎస్ విద్యాసంస్థల అధినేత సుబ్బానాయుడును ఎమ్మెల్యే కొనియాడారు. అదే విధంగా ఈ కార్యక్రమానికి తనను ఆహ్వానించిన మాజీ ఎంపీపీ ప్రసాదరెడ్డికి అభినందనలు తెలిపారు. సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

**– ఎమ్మెల్యేకు సన్మానం ః** బాలికల వసతి గృహం ప్రారంభోత్సవానికి సంగమేశ్వర హైస్కూల్‌కు విచ్చేసిన కమలాపురం ఎమ్మెల్యే పుత్రా క్రిష్ణచైతన్యరెడ్డిని వీఆర్ఎస్ విద్యాసంస్థల అధినేత సుబ్బానాయుడు ఘనంగా స్వాగతం పలికారు. విద్యార్థులచే మార్చ్‌ఫాస్ట్ నిర్వహించి గౌరవ వందనం చేశారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంగమేశ్వర హైస్కూల్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, పిల్లలు, మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## జేఎన్‌టీయూ కళాశాల బీటెక్ ఫలితాలు విడుదల

**పులివెందుల రూరల్. ఆగస్టు 23, ప్రభాతవార్త ః**
పులివెందుల జేఎన్‌టీయూ కళాశాలలో గత నెలలో నిర్వహించిన బీటెక్ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అరుణకాంతి, వైస్‌ప్రిన్సిపల్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ యం.సూర్యనారాయణరెడ్డిలు విడుదల చేశారు. ఫలితాలను కొన్ని రోజుల్లోనే విడుదల చేసినందుకు పరీక్ష కేంద్ర విభాగాధిపతులైన డాక్టర్ హుసేన్‌వలి, డాక్టర్ సాంబయ్యలను ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపాళ్లు అభినందించారు. పరీక్ష ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో పొందు పరిచామని ప్రిన్సిపల్ తెలిపారు.

## ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

**పీలేరు, ఆగస్టు 23 ప్రభాతవార్త:**
స్థానిక పీపీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సావిత్రి మాట్లాడుతూ 2023 ఆగస్టు 23న చంద్రునిపై చంద్రయాన్-3 విజయవంతంగా ల్యాండింగ్ అయిన మధుర క్షణాలను ప్రతీ భారతీయుడు గుండెల్లో నింపుకోవాలన్నారు. భారతదేశంలో ఈవిజయానికి గుర్తుగా ఆగష్టు 23ను జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. అంతరిక్ష పరిశోధన వ్యవస్థ ఆధ్యుడు, ప్రముఖ భారతీయ భౌతిక శాస్త్రవేత్త విక్రం అంబలాల్ సారాభాయ్‌గారిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణప్ప, భాస్కరనాయక్, నాగేశ్వర, పురుషోత్తం, ఖదీర్‌బాషా, చంద్రశేఖర్, దుర్వాసులునాయుడు, రవీంద్రరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఐగా బాధ్యతలు

**పులివెందుల రూరల్. ఆగస్టు 23, ప్రభాతవార్త ః**
పులివెందుల అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టరుగా జీవన్ గంగానాథ్‌బాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఆయన పులివెందుల స్టేషన్‌లో సిబ్బందితో పలు విషయాలపై చర్చించారు.

## సమస్యల పరిష్కారమే గ్రామసభ ధ్యేయం

**కేవి.పల్లె, ఆగస్టు 23 ప్రభాతవార్త:**



మండలంలోని అన్ని గ్రామాలలో ప్రజల అవసరాలు, మౌలిక వసతులు సమస్యలపై స్వయంగా తెలుసుకునేందుకు ప్రతి గ్రామంలో గ్రామసభలు ఏర్పాటుచేసినట్లు ఎంపీడీఓ, ఈవోఆర్డీ ఎస్.ఎ.గఫూర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని సొరకాయలపేట గ్రామంలో సర్పంచి సుజాత అధ్యక్షతన శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధి ఏపీఓ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి గీత, ఏపీఎం చంద్రకళ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం గ్రామసభ తీతవగుంటపల్లె, మఠంపల్లెలోలో సర్పంచి లక్ష్మీదేవి , సర్పంచి రాజన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి (పంచాయతీరాజ్) పాల్గొన్నారు.

## ఘనంగా ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి



**పీలేరు, ఆగస్టు 23 ప్రభాతవార్త:**
స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జనవిజ్ఞానవేదిక జిల్లా అధ్యక్షులు ప్రభుచరణ్ మాట్లాడుతూ చిన్న తనం నుంచి న్యాయవాది కావాలనే ఆశయంతో ప్రకాశం పంతులు కష్టపడి న్యాయవాధి పట్టా పుచ్చుకున్నారన్నారు. 14 సంవత్సరాలు పాటు న్యాయవాధి వత్తిలో కొనసాగి స్వాతంత్ర్య సమరంలో చురుగ్గా పాల్గొని ఉప్పు సత్యాగ్రహం ఉద్యమానికి నాయకత్వం వహించారన్నారు. సైమన్‌కమిషన్ వారి తుపాకులకు వ్యతిరేకంగా గుండె చూపినందుకు ఆయన ధైర్య సాహసాలు చూసి ఆంధ్ర ప్రజలు ఆంధ్రకేసరి అని బిరుదు ఇచ్చిన సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకి వినతి

**పీలేరు, ఆగస్టు 23 ప్రభాతవార్త:**



గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నటువంటి అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేవిధంగా చూడాలని కోరుతూ శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో స్థానిక ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డికి సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి టీఎల్ వెంకటేష్ వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా టీఎల్ వెంకటేష్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలో కేవలం బీవీ రెడ్డి నగర్‌కు మాత్రమే లేఅవుట్ అనుమతులు ఉన్నాయి, మిగిలిన వాటికి లేవని ఎంపీడీఓ లిఖితపూర్వకంగా ఇవ్వడం జరిగింది, కానీ గ్రామపరిధిలో అనేక చోట్ల లే అవుట్లు వేసి ప్రజలకు ఎక్కువ మొత్తంలో డబ్బులకు అమ్ముకుంటున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్నటువంటి అక్రమ లేఅవుట్లపైన చర్యలు తీసుకోవాలని కోరారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో సామాన్య కూలీలకు అవగాహన కల్పించకుండా మేట్లు , ఫీల్డ్ అసిస్టెంట్లుగా పని చేసే వాళ్లు గత ప్రభుత్వంలో ఇష్టానుసారంగా బడాబాబులు మిషనరీలతో పనులు చేసిన కూడా పట్టించుకోకుండా వారికే బిల్లులు చేశారన్నారు. ఈప్రభుత్వంలోనైనా సామాన్య కూలీలకు ఈపథకంపై అవగాహన కల్పించి వారికి ఉపాధి కల్పించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అక్రమ లేఅవుట్లపై విచారణ జరుగుతుందని అదేవిధంగా గ్రామీణ ఉపాధిహామీ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేవిధంగా కషి, వారందరికి ఉపాధి కల్పిస్తామని వారు హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి నరసింహులు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా

**తొండూరు. ఆగస్టు 23, ప్రభాతవార్త ః**



రాష్ట్రంలో రైతుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వం కృషిచేస్తోందని పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి అన్నారు. తొండూరులో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రైతులు చాలా ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. డ్రిప్ పరికరాలు మంజూరు, ఇతరత్రా అందక రైతన్నలు చాలా అగచాట్లు పడ్డారని తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయానికి ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. జాయింట్ కలెక్టరు అతిధిసింగ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఉపయోగించుకుని రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌ఛార్జి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు శివమోహన్‌రెడ్డి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## గాలికుంటు వ్యాధికి జిల్లా వ్యాప్తంగా 3.45లక్షల టీకాలు

**తంబళ్లపల్లె, ఆగస్టు 23, ప్రభాతవార్త:**
అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా పశువులలో గాలికుంటు వ్యాధి నివారణకు 3.45లక్షల టీకాలు వేసినట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ ఏడీ గుణశేఖర్ పిళ్లై తెలిపారు. శుక్రవారం తంబల్లపల్లె పశువైద్య కేంద్రాన్ని సందర్శించి గాలికుంటు వ్యాధి నివారణ చర్యలు, బ్రూసిలోసిస్ వ్యాధి నివారణ తదితర వ్యాధుల నివారణ చర్యలపై ఏడీ సుమిత్ర, మండల డా.సుజనశ్రీలకు సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీలకు 4 అంశాలతో స్వర్ణ యుగం

**తంబళ్లపల్లె, ఆగస్టు 23, ప్రభాతవార్త:**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఉపాధి హామీ గ్రామసభల ద్వారా పంచాయతీలోని మారుమూల గ్రామాల్లోని ప్రజలు వ్యక్తిగత, సామాజిక అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమంలో తమ సమస్యల పరిష్కారంతో భవిష్యత్తులో గ్రామాల్లో స్వర్ణ యుగం తాండవించడం ఖాయమని తంబళ్లపల్లె స్పెషల్ ఆఫీసర్ గుణశేఖర్ పిళ్లై తెలిపారు. ఆయన శుక్రవారం ఎంపీడీవో సురేంద్రనాథ్‌తో కలిసి అన్నగారిపల్లి, గుండ్లపల్లి, తంబళ్లపల్లె గ్రామ సభలలో పాల్గొని ఉపాధి హామీ కార్యక్రమం ద్వారా ప్రజలకు 4 అంశాలతో కూడిన అభివృద్ధి పనులను వివరించి ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎంపీడీవో సురేంద్రనాథ్ 4 అంశాల సమస్యలపై ప్రజలకు విశదీకరించారు. ఈ గ్రామసభలో ప్రజలు గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఉదయ్‌కుమార్‌రెడ్డి, మౌలాలి, వాటర్‌షెడ్ పీవో ఖాజామొహిద్దీన్, టీడీపీ నాయకులు బాలాజీ, టెక్నికల్ అసిస్టెంట్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రచందనం స్వాధీనం.. నిందితులు రిమాండ్

**చిట్వేలి, ఆగస్టు 23, ప్రభాతవార్త:**



చిట్వేలి రేంజ్ పరిధిలోని పెనగలూరు మండలం కొత్తూరు అడవిలో శుక్రవారం ముగ్గురు వ్యక్తులతో పాటు ఆరు ఎర్రచందనం కొయ్యలు పట్టుబడ్డాయని రేంజ్ అధికారి ధీరజ్ పేర్కొన్నారు. వీటి బరువు సుమారు 150 కేజీలు, విలువ రూ.43వేలు ఉండవచ్చన్నారు. వారి వద్ద ఉన్న గొడ్డెలి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామని ఎఫ్ఆర్ఓ ధీరజ్ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో ఎఫ్ఎస్ఓలు శ్రీనివాసులు, సావిత్రి, ఎఫ్‌బీవో వెంకట సుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదర్శ ప్రాయులు ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు

**కడప కార్పొరేషన్, ఆగస్టు 23, ప్రభాతవార్త:**



ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆదర్శ ప్రాయుడని టీడీపీ నాయకులు మాజజీ డిప్యూటీ మేయర్ ఆరీఫుల్లా అన్నారు. శుక్రవారం కడపలోని తన కార్యాలయంలో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ 1946లో జరిగిన ఎన్నికల్లో ప్రకాశం పంతులు ఆంధ్ర రాష్ట్రానికి తొలి సీఎంగా పని చేశారని చెప్పారు. పంతులు అధ్యక్షత వహిస్తున్న ప్రజలు మదరాసు హైకోర్టు వద్ద ఎక్కువ సంఖ్యలో గుమికూడడంతో పోలీసులు జరపాలని తెలిపారు. జనాలనఉ చెల్లా చెదురు చేయడానికి జరిపిన కాల్పుల్లో పార్థసారధి అనే యువకుడు మృతి చెందాడు. దగ్గరికొస్తే కాలుస్తానని హెచ్చరించైనా ప్రకాశం పంతులు తన రొమ్మును చూపించి ధైర్యముంటే కాల్చమని సవాలు చేశారని గుర్తు చేశారు. ప్రకాశం చూపించిన ధైర్య సాహసాలకు ఆంధ్ర కేసరి (ఆంధ్ర సింహం) అని బిరుదు ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో బాజీ, బషీర్, సుభాని, ఖాన్‌సాబ్, ఖదీర్, సొహెల్, షేక్ సౌకత్‌లు పాల్గొన్నారు.

## స్వర్ణ గ్రామ పంచాయతీలకు ప్రణాళికలు సిద్ధం చేస్తాం

**సంబేపల్లె, ఆగస్టు 23, ప్రభాతవార్త:**



మండల వ్యాప్తంగా 17 గ్రామ పం ఆయతీలలో స్వర్ణ గ్రామ పంచాయతీలకు ప్రణాళికలు సిద్ధం చేస్తామని మండల గ్రామ సభల ప్రత్యేక అధికారి తేజస్విని తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో సునీల్ కుమార్, తహసీల్దారు వెంకటేష్‌తో కలిసి వేరు వేరుగా గ్రామసభలు నిర్వహించారు. గ్రామ సభల నిర్వహణ సర్పంచ్ ఆధ్వర్యంలో చేపట్టారు. స్వర్ణ గ్రామ పంచాయతీలో నాలుగు థీమ్‌లు స్వీకరిస్తామన్నారు. అందులో భాగంగా గృహ అవసరాలు అందించడంలో పవర్ కనెక్షన్, ఎల్‌పీజీ గ్యాస్ తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## అంతరిక్ష విజయాల ద్వారా ఇస్రో మానవ ప్రయోజనాలు

**సంబేపల్లె, ఆగస్టు 23, ప్రభాతవార్త:**




చంద్రయాన్ ఆదిత్య వంటి అంతరిక్ష విజయాల ద్వారా ఇస్రో మానవ ప్రయోజనాలను మెరుగు పరుస్తున్నదని జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం ఆగష్టు 23న విక్రమ్ లల్యాండర్ మరియు ప్రజ్ఞాన్ రోవర్ చంద్రుని దక్షిణ ధ్రువం మీదకు విజయవంతంగా భారతదేశం ప్రవేశపెట్టిందన్నారు. ఈ విజయతరహాసంతో దేశమంతా అంతరిక్ష దినోత్సవం నిర్వహించుకోవడం జరుగుతోందన్నారు. ప్రతి విద్యార్థి శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని దిశా నిర్దేశం చేశారు. ఇస్రో సేవలు భారత ఖ్యాతిని పెంపొందించాయన్నారు. ఇంతటి విజయాలకు కారణమైన శాస్త్రవేత్తలను కొనియాడారు. విద్యార్థులకు క్విజ్, నమూనాల తయారీ, డ్రాయింగ్, వకృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గంజాయి గ్యాంగ్‌ను అరికట్టాలి

**కడప వైద్యవిభాగం, ఆగస్టు 23, ప్రభాతవార్త:**




నగరంలోని గౌస్‌నగర్‌లో గంజాయి గ్యాంక్ వార్‌ను అరికట్టాలని జేకే జనం కోసంయూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు లయన్ పటాన్ ఖాదర్ బాషా ఆధ్వర్యంలో కొత్తగా ఛార్జి తీసుకున్న 2వ పట్టణ పీఎస్ ఎస్సై హుసేన్‌ను కలిసి విన్నవించారు. ముందుగా ఆయనకు పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకులు షేక్ చాన్‌బాషా, పీసీఓ షేక్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

## గుళ్లపల్లి ఎన్.రావుకు స్వర్ణపతకం

**- పురస్కారం పొందిన ప్రపంచ 11వ వ్యక్తిగా, తొలి భారతతీయుడుగా గుర్తింపు**

**కడప వైద్యవిభాగం, ఆగస్టు 23, ప్రభాతవార్త:**



ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఆప్తమాలజీ 2024లో ఐసీవో జూల్స్ ప్రాన్సువవా స్వర్ణ పతకం ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వ్యవస్థాపకులు డా.గుళ్లపల్లి ఎన్.రావుకు లభించింది. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎల్వీపీఈఐలో విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ వైద్యులు మాట్లాడుతూ ఈ పురస్కారంతో సత్కరించబడిన మొదటి భారతీయుడు, ప్రపంచ వ్యాప్తంగా 11వ గ్రహీతగా ఆయన గుర్తింపు పొందారన్నారు. ఈ మేరకు కెనడా వాంకూవర్‌లో జరిగిన ప్రపంచ అప్తమాలజీ కాంగ్రెస్ 2024లో ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారన్నారు. 2013లో డా.రావు ప్రపంచ నేత్ర సంరక్షణలో తన నేతృత్వానికి జీవోహెచ్ న్యూమన్ పురస్కారంతో గౌరవించబడ్డారని ఆయన చెప్పారు.

## యువత చేతుల్లో దేశ భవిష్యత్తు




**కడప వైద్యవిభాగం, ఆగస్టు 23, ప్రభాతవార్త:**
దేశ భవిష్యతఉ విద్యార్థుల చేతుల్లో ఉందని విద్యా వ్యవస్థలో మార్పు రావాలని పేద పిల్లలందరికి ఉచిత విద్య అందించాలని కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్ రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ ప్రథమ మహా సభ తిరుపతిలో సెప్టెంబరు 13, 14, 15 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డితో పాటు ఎమ్మెల్యే లోగోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## విజయవంతంగా గ్రామసభల నిర్వహణ

**చిట్వేలి, ఆగస్టు 23, ప్రభాతవార్త:**



గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పంచాయతీరాజ్ శాఖ ఆదేశానుసారం శుక్రవారం మండల వ్యాప్తంగా 21 గ్రామ పంచాయతీలలో సర్పంచుల అధ్యక్షతన కేటాయించిన ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో గ్రామసభలు విజయవంతంగా నిర్వహించినట్లు ఎంపీడీవో శివరామిరెడ్డి తెలిపారు. ఏపీవో చంద్రకళ మాట్లాడుతూ వ్యవసాయాన్ని జాతీయ ఉపాధి హామీ పథకానికి అనుసంధానం, గులకరాళ్ల ఏరివేత, చెత్త ద్వారా సంపదను తయారు చేసే కేంద్రాల బాగోగులు, సిమెంటు రోడ్ల ఏర్పాటు తదితర అవసరాలు ప్రధానంగా గ్రామ ప్రజల నుంచి ఫిర్యాదులుగా తమకు అందాయన్నారు. త్వరితగతిన ప్రాధాన్యత పనులకు నిధులు ఏర్పాటు, పనుల కొనసాగింపు తదితర చర్యలను సత్వరమే చేపడతామని ఏపీవో చంద్రకళ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈసీ ఓబులేసు, ఎంఈవో కోదండ నాయుడు, ఐసీడీఎస్ సీఈపీవో రాజేశ్వరి, సూపర్‌వైజర్లు వసుంధర, సురేఖ, ఏవో సందీప్, అన్ని పంచాయతీల ప్రజా ప్రతినిధులు, కార్యదర్శులు, గ్రామ పెద్దలు, రైతులు, ఉపాధి సిబ్బంది వేతన దారులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## పొలతల పాలకమండలి నియామకం

**పెండ్లిమర్రి, ఆగస్టు 23, ప్రభాతవార్త:**
పెండ్లిమర్రి మండలం గంగనపల్లె పంచాయతీ పొలతల దేవస్థానానికి నూతన ధర్మకర్తల మండలి నియామకం దరఖాస్తులు ఆహ్వానం పలకడం జరుగుతోందని శ్రీ పొలతల మల్లేశ్వరస్వామి దేవస్థానం నూతనంగా ధర్మకర్త మండలి నియామకానికి కర్నూలులో డివిజన్ ఉప కమిషనర్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మకర్త మండలి నియామకానికి ఆసక్తి గల వారు 20 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# గ్రామాల అభివృద్ధి కోసమే గ్రామసభలు

మదనపల్లె, ఆగస్టు 23 ప్రభాతవార్త :



గ్రామాలను ఆదర్శవంతంగా అభివృద్ధి చేసేందుకే ప్రభుత్వం గ్రామసభలను ఏర్పాటు చేసిందని ఎంపిడిఓ భానుప్రసాద్ తెలిపారు. శుక్రవారం రూరల్ మండలంలోని 25 గ్రామ పంచాయితీల నందు స్వర్ణ గ్రామ పంచాయితీ, ఎన్ఆర్ఈజిఎస్ గ్రామసభలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల అవసరాల మేరకు మౌళిక వసతుల ఏర్పాటు చేయడమే కాకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిలైట్లు, కమ్యూనిటి అవసరాలైన రోడ్లు, డ్రైనేజ్, చెరువుల పునరుద్ధరణ లాంటి పనులు ఎన్ఆర్ఈజిఎస్‌తో చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రజలు ఇచ్చిన అర్జీల ద్వారా పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాలతో ఎన్ఆర్ఈజిఎస్ పనులు త్వరితగతిన చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలోనూ గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ ఖాజాబీ, ప్రత్యేక అధికారులు, సర్పంచ్‌లు, గ్రామ సెక్రటరీలు, విఆర్‌ఓలు పాల్గొన్నారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం

మదనపల్లె, ఆగస్టు 23 ప్రభాతవార్త :



రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, వాలంటరీ బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ అన్ని ధానాల కన్నా రక్తదానం చాలా గొప్పదన్నారు. రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రజల ప్రాణాలను కాపాడవచ్చున్నారు. ప్రతి ఒక్కరూ రక్తదాన శిబిరంలో పాల్గొనాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సతీష్‌బాబు మాట్లాడుతూ ఎవరైనా ప్రమాదాల బారిన పడినపుడు రక్తం ఉపయోగపడుతుందన్నారు. 92మంది విద్యార్థులు, అధ్యాపకులు రక్తదానం చేశారు. ఈకార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంఅధికారి వై.అరుణ్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

మదనపల్లె, ఆగస్టు 23 ప్రభాతవార్త :



పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానంచేశారు. భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు శివప్రసాద్, రెడ్డమ్మలు మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక, విజ్ఞాన అభివృద్దిని పెంపొందించుకోవాల్సిన అవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన ఉపాధ్యాయులు జనార్ధన్‌రెడ్డి అధ్యక్షత వహించగా ఉపాధ్యాయులు బి.అమరనాథ్‌రెడ్డి, సుమాకిరణ్, బాబునాయక్, రాంబాబు, ఉమారాణి సిబ్బంది పాల్గొన్నారు.

# ఇసుక మాఫియాను అరికట్టాలి

మదనపల్లె, ఆగస్టు 23 ప్రభాతవార్త :



నియోజకవర్గంలో ఇసుక మాఫియాను అరికట్టి ప్రజలకు ఉచిత ఇసుకను ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం సిపిఎం కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న ఇంటి నిర్మాణాలు చేసుకునే ఇంటి యజమానులకు ఇసుక లభించక ఇబ్బందులు పడుతుంటే మాఫియాలో భాగస్వామ్యం ఉన్న వారు ఇసుకను కుప్పలు కుప్పలుగా పోగు చేసుకొని లాభాలు గడిస్తున్నారన్నారు. బాహుదా కాలువను సైతం ఆక్రమించి ఇసుకను కొల్లగొడుతున్నారన్నారు. ఇప్పటి వరకు పట్టణ పరిసర ప్రాంతాల్లో పది ఇసుక నిల్వ కేంద్రాలు, రెండు మట్టి అక్రమ కేంద్రాలు రెవెన్యూ అధికారులు చూపించడం జరిగిందన్నారు. ఒక చోట మాత్రం ఇసుకను అధికారులు సీజ్ చేశారని మిగిలిన చోట్ల వదిలేయడం జరిగిందన్నారు. మైనింగ్ మాఫియాతో అధికారులు అంటకాగుతున్నారన్నారు. ఇసుక మాఫియాను అరికట్టి పేదలకు న్యాయంచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం నాయకులు నాగేశ్వర్‌రావు, ఏఐటియుసి నాయకులు క్రిష్ణమూర్తి, సిఐటియుసి నాయకులు హరీష్‌శర్మలు పాల్గొన్నారు.

# దివ్యసిల్క్‌ప్రారంభోత్సవంలో టిడిపి నాయకులు

మదనపల్లె, ఆగస్టు 23 ప్రభాతవార్త :



పట్టణంలోని నీరుగట్టువారిపల్లె మాయాబజార్‌లో శుక్రవారం తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు, గుండ్లపల్లె యోగేశ్వర్‌బాబు (పెద్దబాబు)లచే ప్రారంభించిన దివ్యసిల్క్ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, టిడిపి సీనియర్ నాయకులు రాటకొండ బాబురెడ్డి, తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ దాసరిపల్లె జయచంద్రారెడ్డి, జనసేన రాయలసీమ కన్వీనర్ రాందాస్‌చౌదరి, తంబళ్ళపల్లె కోఆర్డినేటర్ సీడ్ మల్లికార్జుననాయుడు, నాయకులు పెంచుపాడు స్వామి, రైస్‌మిల్ రమణ, విజయభారతి ప్రిన్సిపాల్ సేతు, రాటకొండ గురుప్రసాద్, ఎస్.ఎ.మస్తాన్, ఆర్‌జె.వెంకటేష్, రాటకొండ మధుబాబు, దొరస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో కమ్యూనిస్టు నాయకుడు మృతి

మదనపల్లె, ఆగస్టు 23 ప్రభాతవార్త :

సీనియర్ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు హైదర్‌ఖాన్(87) అనారోగ్యంతో శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈయన గతంలో ఆర్టీసిలో 30సంవత్సరాలు మెకానిక్‌గా సేవలు అందించి కార్మిక నాయకునిగా ఎదిగారు. కమ్యూనిస్టు పార్టీకి ఆయన ఎనలేని సేవలు చేశారు. ఆయన మృతి పట్ల సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు,ఏఐటియుసి, సిఐటియు, నాయకులతో పాటు పలువురు ఆయన భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

# జాతీయ సైన్స్ దినోత్సవం

మదనపల్లెక్రైం, ఆగస్టు 23 ప్రభాతవార్త :



పట్టణంలోని బసినికొండనందు జడ్పి ఉన్నత పాఠశాలలననో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు భాస్కరన్ తయారు చేసిన ఉపగ్రహ నమూనా, రాకెట్ నమోనాలతనో ప్రదర్శన నిర్వహించారు. బసినికొండ ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు చంద్రయాన్-3 విజయాన్ని విద్యార్థులకు వివరించారు. ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు ఎం.భాస్కర్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదిలక్ష్మి, పద్మావతి, శివశంకర్, రామచంద్ర, శ్రీదేవి, ఉపాధ్యాయుబృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# కారు ఢీకొని భవన కార్మికులకు తీవ్రగాయాలు

మదనపల్లెక్రైం, ఆగస్టు 23 ప్రభాతవార్త :



కారు ఢీ కొని భవన కార్మికులు తీవ్రంగనా గాయపడి కోమాలోకి వెళ్ళారు. ఘటనపై రెండవ పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు. మదనపల్లె గాంధీ పురానికి చెందిన భవన కార్మికులు శివరాం(27) నాగరాజు(28)లు శుక్రవారం ఉదయం ద్విచక్రవామనంలో స్థానికచంద్రాకాలనీ వద్ద భవన నిర్మాణం పనులు చేయడానికి బయలుదేరారు. స్కూటర్ చంద్రకాలనీ బైపాస్‌రోడ్డుపైకి వెళ్ళగానే వేగంగా వచ్చి భవన కార్మికులను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి బలమైన గాయలై తీవ్రంగా గాయపడగా స్థానికులు గుర్తించి బాధితులను 108లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి మెరుగైన వైద్యం అందించారు. వారి ఆరోగ్యం మరింత విషమించడంతో డాక్టర్ల సలహా మేరకు కుటుంబీకులు వారిని తిరుపతి రుయాకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# స్వర్ణగ్రామాల ప్రగతి ప్రభుత్వ లక్ష్యం

కురబలకోట, ఆగస్టు 23 ప్రభాతవార్త :



స్వర్ణ గ్రామాల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యమని స్పెషల్ ఆఫసర్ శ్రీరాముల నాయక్, ఎంపిడిఓ హరనారాయణలు అన్నారు. శుక్రవారం కురబలకోట గ్రామ సచివాలయాల వద్ద స్వర్ణ గ్రామ పంచాయతీ గ్రామసభను సర్పంచ్ సుజాత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో కనీస సౌకర్యాలను ఉపాధి హామీ పథకం కింద కూలీలకు కరువు పనులు వ్యవసాయ అభివృద్ధికి తదితర పనులను ఉపాధిహామీ పథకం కింద చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు సిసిరోడ్లు, మురుగుకాలువలు, వీధిదీపాలు, కోళ్ళఫారం షెడ్లు, తదితర సమస్యలపై అర్జీలను సమర్పించారు. ఈ గ్రామసభలో జడ్పిటిసి బైసాని జ్యోతి, తహశీల్దార్ తపశ్వని, టిడిపి నాయకులు రాఘవరెడ్డి బాబాపకృద్దిన్, విఆర్‌ఓ శ్రీనివాసులురెడ్డి, గ్రామ సెక్రటరీ శేషగిరికుమార్, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలు స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చడమే ధ్యేయం

నిమ్మనపల్లె, ఆగస్టు 23 ప్రభాతవార్త :



మహాత్మగాంధీ కళలను నెరవేర్చేవిధంగా గ్రామాలను స్వర్ణాంధ్ర ప్రదేశగా మార్చడమే ధ్యేయం ఇరిగేషన్ డిఈ ప్రసాద్ అన్నారు. శుక్రవారం నిమ్మనపల్లె మండలం తవళం పంచాయతీలో జరుగుతున్న గ్రామ సభకు ప్రత్యేక అధికారిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామణంలో ప్రతి ఇంటికి విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్డి, గ్యాస్ సిలిండర్ అత్యవసరం అన్నారు. ప్రతి గ్రామానికి రోడ్లు, మురుగుకాల్వలు, రక్షిత మంచినీటి పథకాలు ప్రత్యేకంగా అవసరమని ఎంపిడిఓ రమేష్ అన్నారు. గ్రామ సర్పంచ్ రెడ్డప్ప అధ్యక్షతన జరిగిన ఈ గ్రామసభలో ఏపిఎం రజనీకుమారి, మాజీ ఎంపిపి రామక్రిష్ణ, మాజీ సర్పంచ్‌లు రాజన్న, రెడ్డప్ప, ఏపిఓ రమేష్, ఏఈ కొండప్ప, గుర్రప్ప, టిడిపి నాయకులు జయరామ్, రెడ్డప్ప, బిజెపి నాయకులు సోమశేఖర్, సంఘమిత్రాలురెడ్డి కుమారి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా బండ్లపై పంచాయితీలో ఎంపిపి నరసింహులు, మాజీ సర్పంచ్ లక్ష్మన్న, రాచవేటివారిపల్లె పంచాయితీలో పార్లమెంటు అధికార పార్టీ ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్, సర్పంచ్ మధు, మాలమహానాడు అధ్యక్షులు మాణిక్యం, రెడ్డివారిపల్లెలో సర్పంచ్ రెడ్డమ్మ, మాజీ ఎంపిటిసి రాజా, ముష్టూరులో సర్పంచ్ చెంద్రాయుడు, మాజీ సర్పంజ్ రమణ,లక్ష్మన్న, నిమ్మనపల్లెలో సర్పంచ్ పాపులమ్మ అధ్యక్షతన గ్రామసభలు జరిగాయి. ప్రతి గ్రామంలోనూ భారీ సంఖ్యలో మహిళలు హాజరై వినతిపత్రాలు అందజేశారు.

# విక్ఫోనాలో ఎరువులు వాడకంలో అధిక దిగుబడులు

నిమ్మనపల్లె, ఆగస్టు 23 ప్రభాతవార్త:



రైతులు పంటపొలాల్లో విక్పోనాలో ఎరువుల వాడకం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏపి రీజనల్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సహకార సంఘ కార్యాలయంలో సిఈఓ హరినాథ్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా మేనేజర్ దిలీఫ్‌లతో కలసి విక్పోనాలో యూరియా, డిఎపిఫ్‌ల విక్రయాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 1960లో సహకార సంఘాలచే విక్పో ఎరువులను తయారు చేస్తొందన్నారు. ప్రస్తుతం ఈ కంపెనీలో యూరియాను లిక్విడ్ రూపంలో రైతులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఒక బస్తా యూరియాకు నాన్‌లిక్విడ్ ద్రావణం అరకిలో సరిపోతుందన్నారు. పంటపొలాల్లో ఫిచకారి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 15లక్షల డోన్‌లను రైతుల కోసం అందుబాటులోకి తెచ్చిందన్నారు. అనంతరం కొత్తపల్లె గ్రామంలో శ్రీనివాసులు మడిస్థలంలో డోన్ ద్వారా పిచకారిని డెమో రూపంలో వివరించారు. డోన్‌చే ఎకరాకు కేవలం 7నిమిషాలు పడుతుందన్నారు. డిన్‌ల ద్వారా పిచకారిచేసుకోవాలంటే ముందుగానే వారిపేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కేవలం ఎకరాకు రూ.300లు చెల్లించి పిచకారి చేసుకోవచ్చునన్నారు. అదే విధంగా రైతుల కోసం స్పేయర్లు, మినిట్రాక్టర్లు, పనిముట్లు వంటివి సబ్సిడీ ధరలకే ఇవ్వనున్నట్లు సిఈఓ హరినాథ్‌రెడ్డి తెలిపారు.

# పార్టీ కోసం కష్టపడిన వారికి భరోసానివ్వండి

కురబలకోట, ఆగస్టు 23 ప్రభాతవార్త :



పార్టీ విజయం కోసం, పార్టీ బలోపేతానికి కష్టపడిన కార్యకర్తలకు భరోసా ఇవ్వాలని రాష్ట్రమంత్రి నారా లోకేష్‌కు రాజంపేట పార్లమెంటు బిసిసెల్ అధ్యక్షులు సురేంద్రయాదవ్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంత్రిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా సమస్యలపై మంచి అవగాహన ఉందన్నారు. పార్టీకోసం అహర్నిశలు శ్రమించి అక్రమకేసులతో ఇబ్బందులు పడుతున్న మండలస్థాయి నాయకులు, కార్యకర్తలకు కేసుల నుంచి విముక్తి కల్పించాలని నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రిని ఆయన కోరారు. తంబళ్లపల్లె నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి అక్కడ పరిస్థితులను చక్కదిద్దుతానని కార్యకర్తలకు న్యాయం చేస్తానని భరోసా ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

# ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

కురబలకోట, ఆగస్టు 23 ప్రభాతవార్త :



మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి ఇస్రో శాస్త్రవేత్త చిరంజిద్ గృహ మంజుదార్ పాల్గొని మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయానికి గుర్తుగా ఈ దినోత్సవాన్ని జరుపుకొంటున్నామని తెలిపారు. ఇస్రో చంద్రయాన్ 3 అంతరిక్ష యాత్రచేపట్టి ఆగస్టు 23న ల్యాండర్‌ను చంద్రునిపై దింపిందన్నారు. ఇది అంతరిక్ష రంగంలో సరికొత్త రికార్డులను సృష్టించిందన్నారు. చంద్రుని సౌత్‌పోల్‌పై కలుమోపిన మొదటిదేశంగా అవతరించిన ఎన్నో అభివృద్ధి చెందిన దేశాలకు సాధ్యం కాని ఘనతను భారత్ సాధించిందన్నారు. విద్యార్థులు సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాలపై చేసేలా మనం అందరం చేయాలన్నారు. అంతరిక్ష పరిశోదనపై ఆసక్తి పెంచేలా వివిధ కార్యక్రమాలు చేపట్టాలని అధ్యాపకులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సి.యువరాజ్, వైస్‌ప్రిన్సిపాల్ రామనాథన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# గ్రామాలభివృద్దే ధ్యేయం : సర్పంచ్

కురబలకోట, ఆగస్టు 23 ప్రభాతవార్త :



మారుమూల గ్రామాల అభివృద్దే ధ్యేయమని కనసానివారిపల్లె సర్పంచ్ ఆర్‌కె.క్రిష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో సిసిరోడ్లు, డ్రైనేజి, వీధిలైట్లు, హార్టికల్చర్, వ్యవసాయ, తాగునీరు, స్వయం సంవృద్ధి మౌళిక సదుపాయాలు, జీవనోపాది వంటి పనులపై ఈ సభలో తీర్మాణాలు చేశారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ గ్రామసభలో ఎంఈఓ ద్వారకనాథ్, సెక్రటరీ చంద్రకళ, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# టూటౌన్ సిఐ రామచంద్రకు సన్మానం

మదనపల్లెక్రైం, ఆగస్టు 23 ప్రభాతవార్త :

మదనపల్లె రెండవ పట్టణ సిఐ రామచంద్రను శుక్రవారం పట్టణంలోని లాడ్జీల యజమానుల అసోసియేషన్ సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ లాడ్జీల యజమానులు శాంతి భద్రతల దృష్ట్యా నియమ నిబంధనలు పాటించాలన్నారు. ఎవరైన అనుమానిత వ్యక్తులు లాడ్జిల్లో బస చేయుటకు వచ్చినపుడు వారి వివరాలను గోప్యంగా తమకు సమాచారం అందించాలన్నారు. అసాంఘీక కార్యకలాపాలకు చోటు ఇవ్వరాదని ప్రశాంత వాతావరణ కోసం లాడ్జీ యజమానులు సహకరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా వారు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు భాస్కర్, సుధాకర్‌రెడ్డి, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సమస్యలు పరిష్కారం కోసమే గ్రామ సభలు

లక్కిరెడ్డిపల్లె,ఆగస్టు 23,ప్రభాతవార్త:

గ్రామ సమస్యల పరిష్కారం కోసమే గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో వెంకటరామిరెడ్డి ఈవో పి ఆర్ డి పట్నాయక్ పేర్కొన్నారు శుక్రవారం మండలంలోని 16 గ్రామ పంచాయతీలో ఆ గ్రామ సర్పంచ్ స్పెషలాఫీసర్ ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు గ్రామంలోని త్రాగునీరు సమస్య రోడ్లు రహదారులు ఉపాధి హామీ పథకం పనులు వీధిలైట్లు డ్రైడే సమస్యలపై వినతలు అధికారులకు అందజేశారు ఈ సందర్భంగా డిన్నెపాడు కాకలవరం,పందెలపల్లి జై వడ్డేపల్లి డి వడ్డేపల్లి కోనంపేట గ్రామాలలో త్రాగునీరు సమస్య ఇప్పటికీ అలాగే ఉందని గ్రామాలు తాగిన సమస్యల పరిష్కరించాలని ఆ గ్రామస్తులు స్పెషల్ ఆఫీసర్లకు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ లు సర్పంచులు అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాలభివృద్దే ధ్యేయం : పర్వీన్‌తాజ్

బి.కొత్తకోట, ఆగస్టు 23 ప్రభాతవార్త :



మారుమూల గ్రామాల అభివృద్దే ధ్యేయమని రాష్ట్ర తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బీరంగిలో గ్రామ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న పర్వీన్‌తాజ్ మాట్లానడుతూ ఈ సభలో సిసిరోడ్లు, డ్రైనేజి, వీధిలైట్లు, హార్టికల్చర్, వ్యవసాయ, తాగునీరు, స్వయం సంవృద్ధి మౌళిక సదుపాయాలు, జీవనోపాది వంటి పనులపై ఈ సభలో తీర్మాణాలు చేశారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ గ్రామసభలోస మండల ఈఓఆర్డి, పంచాయితీ కార్యదర్శి సర్పంచ్ వెంకటరమణ, విఆర్‌ఓ ఐసిడిఎస్ సూపర్‌వైజర్, సచివాలయ సిబ్బంది, ఆనంద గోపినాథ్, సురేష్ వెంకటేష్ గాజుల సురేష్, చౌడప్ప, శ్రీరాములు, సుబ్బన్న, నరసింహులు, వెంకటపతి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్దే లక్ష్యం

రామసముద్రం, ఆగస్టు 23 ప్రభాతవార్త :

మండలంలోని ప్రతి గ్రామంలోనూ పండుగ వాతావరణం కనిపించింది. ప్రతి గ్రామ పంచాయితీల్లో ఉదయం నుంచి గ్రామసభలు నిర్వహించారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జిల్లాలో ఘనంగా గ్రామసభలు నిర్వహించారు. మండలంలో పంచాయితీ వ్యవస్థ బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాన్ని ప్రతి పంచాయితీ గ్రామాల్లో ఒకేరోజు నిర్వహించడం జరిగింది. 87రకాలైన పనులకు ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టేందుకు అవకాశం లభించింది. ఈ సమావేశంలో తహశీల్దార్ నిర్మాలాదేవి, ఎంపిపి కుసుమకుమారి, సర్పంచ్ కవితమ్మ, విజయకుమారగౌడు, రెడ్డప్పనాయుడు, తిప్పరాజు, ఆదినారాయణ, గెవెన్న, సీతారామస్వామి, శివశంకర్, చంద్రారెడ్డి, శంకర్‌రెడ్డి, పాల శీన, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలను సమగ్ర అభివృద్ధి చేయాలన్నదే కూటమి లక్ష్యం

పెద్దమండ్యం ఆగస్టు 23 ప్రభాతవార్త



గ్రామాల్లో మౌళిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేయాలన్నదే కూటమి లక్ష్యమని స్పెషల్ ఆఫీసర్, హౌసంగ్ ఏఈ సందీప్ అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న గ్రామసభలో పెద్దమండ్యంలో జరిగిన సభల్లోవాటర్‌ప్లాంట్ నిలిపివేశారు. క్లీనాంధ్రప్రదేశ్ చెత్తవాహనం వాడుకలో లేదు. వీధి దీపాలు లేవు. సైడ్‌కాలువలు నాశిరకం పనులు, వాటిపైకప్పులు లేక దుర్వాసనదీంతో ఆనారోగ్యాలు, ఉపాది పనుల్లో అక్రమాలు, వాటర్‌పైపులు లీకేజి, చెరువు కాలువ మరమ్మతు పాఠశాలల్లో ప్రహరీగోడలు, ఇలాంటి సమస్యలపై అధికారులకు జనసేన కార్యకర్తలు, ప్రజలుసమస్యలను అర్జీలరూపంలో తెలియచేశారు. గతప్రభుత్వం అసమర్ధ పాలనలో గ్రామాల నిధులను దారిమళ్ళించి అభివృద్దికి నోచుకోక 5సంవత్సరాలు తీవ్ర ఇబ్బందులు పద్దామని తెలిపారు. అందుకు కూటమి ప్రభుత్వం గ్రామస్థాయి నుండి అభివృద్దిని పెంపొందించి ప్రజలకు మంచి చేయాలని ఉపాది హామీ పథకం ద్వారా లబ్ది చేకూర్చే విదంగా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాషా, ఎంపిటీసి జయరాం, ఎపివో హరి, ఎపివో మురళి, కార్యదర్శి జగన్మోహన్ ప్రజలు జనసేన నాయకులు, అఫ్రాఫ్, నాగూర్‌వల్లి, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సభల ద్వారా అయినా ప్రజా సమస్యలు తీరేనా...

వీరబల్లి, ఆగష్టు 23, ప్రభాతవవార్త :



మండలంలో శుక్రవారం జరిగిన గ్రామ సభల్లో ప్రజలు అనేక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఈ గ్రామ సభల ద్వారా అయినా ప్రజల సమస్యలు తీరేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా ఏ గ్రామ సభలో చూసినా కన్నీటి సమస్యలే అని ఈ నీటి సమస్యలు ఇప్పటికైనా తీరేనా అని పలువురు గ్రామ సభల ద్వారా తెలిపారు. అదేవిధంగా గ్రామాలలో మంచినీటి సౌకర్యంతో పాటు మౌళిక సదుపాయాలు కూడా కల్పించాలని చాలా గ్రామాలలో మురికినీటి కాలువలు, వీధిలైట్లు, సిసి రోడ్లు, ఇప్పటికీ లేవని, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ గ్రామ సభలో ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ గ్రామ సభలో గ్రామ ప్రజలు తమ గ్రామాలలోని పమస్యలను వ్రాత పూర్వకంగా అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమమంలో మండల స్పెషలాఫీసర్ అల్లాబకాష్, ఎంపీడీఓ మల్లీశ్వరి, ఈవోపిఆర్‌డి రామచంద్రా రెడ్డి, ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాధ రెడ్డి, గాలివీటి వీరనాగిరెడ్డి, టిడిపా మండల అధ్యక్షుడు భానుగోపాల్ రాజు, స్థానిక టిడిపి నాయకులు ఎర్రపురెడ్డి సురేంద్ర రెడ్డి, తాటిగుట్ల శ్రీధర్ రెడ్డి, ఆంజనేయులు రెడ్డి, బిసి సంఘం నాయకుడు తుమ్మల రమేష్ బాబు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, ఇరువర్గాల నాయకులు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన రూరల్ సిఐ

వీరబల్లి, ఆగష్టు 23, ప్రభాతవవార్త :

నూతనంగా రాయచోటి రూరల్ సిఐగా పదవీ బాధ్యతలు చేపట్టిన వరప్రసాద్ వీరబల్లి మండల పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం పరిశీలించడం జరిగింది. ఇందులో భాగంగా ఆయన పోలీస్ స్టేషన్ లోని రికార్డులను పరిశీలించారు. వివిధ సమస్యలపై అక్కడ ఉన్న సిబ్బందితో మాట్లాడారు. ఈమన గతంలో ఇక్కడ యస్ఐగా కూడా పని చేశారు.

# జగన్‌రెడ్డి హయాంలో వ్యవస్థ పూర్తిగా కూలిపోయింది

చిన్నమండెం, ఆగష్టు 23, ప్రభాతవార్త :



మాజీ సీఎం జగన్‌రెడ్డి హయాంలో పంచాయతీరాజ్ వ్యవస్థ పూర్తిగా కూలిపోయిందని, గ్రామాల అభివృద్ధి కుంటు పడిందని కుప్పం నియోజకవర్గ పరిశీలకులు గాజుల ఖాదర్‌బాషా అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాలలో గ్రామసభలు జరిగాయి. ఈ గ్రామసభలలో ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో మౌళిక వసతులకు సంబంధించి పనులను ప్రజలకు అర్జీల మేరకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గాజుల ఖాదర్‌బాషా మాట్లాడుతూ గ్రామాలు చూస్తే పూర్తిగా మౌళికక వసతులు లేకుండా దెబ్బతిన్నాయన్నారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ దివ్య, ఎపిడి రవికుమార్, అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకకులు అక్రమ్, నాజర్ అహ్మద్, సిద్ధయ్య, జయశంకర్, షరీఫ్ ఇర్ఫాన్, రహంతుల్లా, ఖదీర్, రఫీ, ఖాదర్, మొహిదీన్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సభకు సమస్యల వెల్లువ

పెనగలూరు,ఆగష్టు23,ప్రభాతవవార్త :



మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో ఆయా గ్రాయ సర్పంచుల ఆధ్వర్యంలో గ్రామ సభలు శుక్రవారం నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశానుసారం ప్రతి గ్రామ పంచాయితీలో గ్రామ సభలు నిర్వహించారు. ముఖ్యంగా ఆయా గ్రామ సభలలో ప్రజలు పాల్గొని సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. ముఖ్యంగా ప్రతి గ్రామ పంచాయితీలలో సిసి రోడ్లు, వేయాలని, త్రాగునీరు అందించాలని, మురుగు కాలువలు నిర్మించాలని, అదేవిధంగా ప్రతి పంచాయితీ నుండి సమస్యలు వెల్లువలా వచ్చాయి. వాటిని క్రోడీకరించి అంతర్జాలంలో ఉంచనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఒక విధంగా ప్రజల నుండి ఊహించని విధంగా సమస్యలు వెల్లువలా వచ్చాయని తెలిపారు. మండల కేంద్రంలోని పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ కోటపాటి సుబ్బమ్మ, ఉప సర్పంచ్ దేపూరి చిన్న వెంగర్రెడ్డి అధ్యక్షతన గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ప్రజలు అనేక సమస్యల్ని సర్పంచ్ దృష్టికి తీసుకు వచ్చారు. అందుకు సర్పంచ్ స్పందిస్తూ ప్రతి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమమంలో గ్రామ కార్యదర్శి, గ్రామ ప్రజలు, జనసేన, టిడిపి వైసిపి నాయకులు షేక్ షామీర్ బాషా, తాటిపోయిన ధనయ్య, అబ్దుల్ మోషీద్, కోలా మురళి కొత్త బాలక్రిష్ణ, కోడూరు విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాభివృద్ధికి గ్రామాలే పట్టుకొమ్మలు

గాలివీడు, ఆగస్టు 23(ప్రభాతవార్త):



రాష్ట్ర అభివృద్ధికి గ్రామాలే పట్టుకొమ్మలని టీడీపీ నాయకులు మిట్టపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గోపనపల్లి గ్రామంలో గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామసభల ద్వారా గ్రామాల్లో అవసరాలను గుర్తించడం, అందుకు తగ్గ అభివృద్ధి పనుల నిర్వహణ కోసం ప్రణాళికలు రూపొందించుకుని గ్రామ అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే అభివృద్ధి పనుల గుర్తింపు- ప్రణాళిక ప్రక్రియను రూపొందించుకుని గ్రామ సర్పంచ్ అధ్యక్షతన ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామసభలను నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామ పంచాయతీలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో మౌలిక సదుపాయాలను కల్పించుకునే ఉద్దేశ్యంతో గ్రామంలో ప్రతి కుటుంబానికి 100 రోజుల ఉపాధి హామీ పనిని తప్పకుండా కల్పించడం జరుగుతుందన్నారు. గతంలో ఎంత వెనుకబడి ఉన్న గ్రామాలలో నేడు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అంచలంచలుగా గ్రామాభివృద్ధికి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేనే రాజు నేనే మంత్రి లా గండి ఆలయ అధికారి తీరు

చక్రాయపేట,ఆగస్టు 23,ప్రభాతవార్త:

గండి దేవస్థానం సహాయ కమిషనర్ తీరు నేనే రాజు నేనే మంత్రి అనే విధంగా తయారైందని పాలకమండలి చైర్మన్ కావలి కృష్ణ తేజ మండిపడ్డారు. శుక్రవారం ఆయన గండిలో పాలక మండల సభ్యులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలయ అధికారి పాలకమండలి అంటే ఏమాత్రం గుర్తింపు లేకుండా వ్యవహరిస్తున్నాడని చెప్పారు. ఉత్సవాలకు సంబంధించి గాని ఆలయ జమ ఖర్చులకు సంబంధించి గాని పాలక మండల సభ్యుల సమావేశం పెడతానని అంత వరకు సమావేశం పెట్టనని అవసరమైతే నా ఉద్యోగాన్ని అయినా వదిలేస్తానని చెబుతున్నాడని మండిపడ్డారు. దేవదాయ శాఖ రెవెన్యూ ఆక్ట్ జీవో ఎంఎస్ నెంబర్ 366 తేదీ 19 03 1989 ప్రకారం ఈ రోజు తామే పాలకమండలి సభ్యుల సమావవేశం ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా తనచే జండా ఎగురవే యించాల్సి ఉండగా నేను అలా చేయించను అని చెప్పి ప్రధాన అర్చకునిచే జెండాను ఆవిష్కరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు బిందు సాగర్ మునేశ్వరి లలితమ్మ కుమారి జయమ్మ వెంకటరామిరెడ్డి చక్రపాణి రెడ్డి కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గురు మట్కా నిర్వాహకులు అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 23, ప్రభాతవార్త:

పట్టణంలోని వాస్తు కాంప్లెక్సు వద్ద శుక్రవారం ముగ్గురు వ్యక్తులు మట్కా నిర్వహిస్తుండడంతో అరెస్టు చేసినట్లు 2వ పట్టణ ఎస్సై యుగంధర్ తెలిపారు. ఆయన వివరాల మేరకు తమ సిబ్బందికి రాబడిన సమాచారం మేరకు పట్టణానికి చెందిన మైఖేల్, గన్నా, చాంద్‌బాషా అనే ముగ్గురు వ్యక్తులు మట్కా రాస్తుండడంతో వారిని అరెస్టు చేసి వారి నుంచి రూ.60వేలు నగదు, మట్కా స్లిప్పులు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# రాయలసీమ వాసులకి కూలీగా సేవలందిస్తా

### గ్రామ సభల ద్వారా సమస్యలు పరిష్కారం... 20 సంవత్సరాల తర్వాత రైల్వేకోడూరులో అభ్యర్థిని గెలిపించిన రూపానంద రెడ్డి





**రైల్వేకోడూరు,ఆగష్టు 23,ప్రభాతవార్త:**
రాయలసీమ వాసులు నీతి పరులని ధైర్యశాలలని వారి సేవకై కూలీగా పనిచేస్తానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. శుక్రవారం రైల్వేకోడూరు నియోజకవర్గంలోని మైసూరు వారి పల్లెలో గ్రామ సభలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సభ్యల ద్వారా సమస్యలను జవాబుదారితనం వెలుబడుతుందని ముఖ్యంగా గ్రామాలలో ఉన్న సమస్యలకు పరిష్కార వేదికగా ఈ గ్రామసభ ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా గత వైసీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం 41 వేల కోట్ల రూపాయలను దోచేసిందని కేవలం ఖజానాను ఖాళీ చేసి ఒట్టి ఆర్థిక వ్యవస్థను ఉమ్మడి ప్రభుత్వానికి వైసీపీ ప్రభుత్వం అప్పజెప్పిందని కేవలం దాచుకొని దోచుకోవడం నాందిగా పెట్టుకుని వైసీపీ ప్రభుత్వం పని చేసిందని ఆయన వైసీపీ ప్రభుత్వం పై దుమ్మెత్తి పోశారు ముఖ్యంగా ఆగష్టు 15న స్వాతంత్ర దినోత్సవాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్క చిన్న పంచాయతీ మేజర్ పంచాయతీలకు పది 20 వేల రూపాయలను అందజేసి పంచాయతీల అభివృద్ధికి పాటుపడుతున్న ప్రభుత్వం ఉమ్మడి ప్రభుత్వము అని ఆయన అన్నారు. ముఖ్యంగా రైల్వే కోడూరు ప్రాంతం పండ్లకు ప్రసిద్ధి చెందిన ఏకైక ప్రాంతమని వాటికోసం రైతులు పడుతున్న సమ్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో చర్చించి ఓల్డ్ స్టోరేజ్ మరియు పలు రకాల రోడ్ల అభివృద్ధికి నిధులను కేటాయించి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని అన్నారు రాష్ట్ర చరిత్రలో అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఉమ్మడి ప్రభుత్వం పని చేస్తుందని ప్రతి ఒక్క కుటుంబానికి ఏదో ఒక రూపంలో ఆర్థిక స్వలాభం పొందే విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని అన్నారు ప్రభుత్వంలో ఇటీవల వైసీపీ ప్రభుత్వంలో రాజంపేట అన్నమయ్య డ్యాం వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో కొట్టుకుపోవడం అందులో పశుసంపద నష్టం ఎంతో తనను కలిసివేసిందని ప్రతి సారి ఈ విషయాన్ని గుర్తుతెచ్చుకుంటే మనోవేదనకు గురి అవుతున్నాని పవన్ కళ్యాణ్ అన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు పరిపాలన అధ్యక్షుడిని ఆయనతో నడవడానికి ఎన్ని అవాంతరాలు ఎదురైన ఆయనతోనే పయనిస్తానని ఆర్థిక లోటుపాటును పరిశ్రమలు స్థాపించడంలోనూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక విజన్ కలిగిన నాయకులని అన్నారు దేశ ప్రధాని నరేంద్ర మోడీ దేశాన్ని పరిపాలించడంలో ఆయనకు ఆయనే చాటి ముఖ్యంగా మొన్న జరిగిన ఎన్నికలలో మూడు పార్టీలు ఏకమై రక్షన పాలనకు అంతం వాడమని అన్నారు రైల్వేకోడూరు ప్రాంతంలో రోడ్ల దృష్టిని చాలా అధ్వానంగా ఉందని రానున్న రోజుల్లో బైపాస్ రోడ్డు అభివృద్ధికి నిధులు కేటాయించి రైతు సమస్యలపై పూర్తిస్థాయిలో పాటు కార్యాలయం నుండి పరిపాలన వ్యవస్థను నడుపుతామని అన్నారు. రాష్ట్ర మధ్యలో రవాణాశాఖ మాత్యులు రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాజంపేట ఎంపీగా మూడుసార్లు గెలిచిన సందర్భంలో గ్రామ సభలకు ఎంపీ ఎందుకు రాలేదో ప్రజలు తెలుసుకోవాలని జవాబుదారితనం ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలనకు రాష్ట్ర ప్రజలు చరమగీతం పాడి ఇంటికి పంపించారని రైల్వేకోడూరు నియోజకవర్గంలో అభివృద్ధిని పాటించడంలో ప్రస్తుత టిడిపి ఇన్చార్జ్ ముక్క రూపానంద రెడ్డి విశేష కృషి చేస్తున్నారని అన్నారు ముఖ్యంగా రూపానంద రెడ్డి చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో విజయవంతం అయ్యిందని ప్రజా సమస్యలకు పరిష్కార వేదికగా మైసూరు వారి పల్లె గ్రామ సభ అని అన్నారు రానున్న రోజుల్లో రాష్ట్రంలో సుపరిపాలన రానున్నదని ఆగష్టు 15న నిరుపేదలకు కడుపునిండా అన్నం పెట్టే అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి నిత్య కృషివలుడని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కృష్ణదేవ్ జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకుర్తి తిరుపతి ఎమ్మెల్యే ఆర్ఎ శ్రీనివాస్ మైసూర్ వారి పల్లె సర్పంచ్ సంయుక్త జనసేన నాయకులు తాతంశెట్టి నాగేంద్ర బోగినేని మనీ పీసీఎన్ బ్రదర్స్ మలిశెట్టి మురళీధర్ గౌడ్ గడికోట సుబ్బరాయుడు కట్ట గుండయ్య నాయుడు తిరుపాల్ రమణా రెడ్డి తిప్పన రాజశేఖర్ పసుపులేటి జై చంద్ర కొండేటి వెంకటరమణ తో పాటుపాధి హామీ మద్దిలేటి ఎంపీడీవో జాషువా వివో పి ఆర్ డి నాగార్జున ఆర్డబ్ల్యూఎస్ రమేష్ హౌసింగ్ మురళి ఎపిఓ ఉమామహేశ్వరరావు వెలుగు మల్లికార్జున రాజు రవి తో పాటు వికాస్ రెడ్డి వేణుగోపాల్ రెడ్డి సుబ్బరాయిరెడ్డి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

## మూడో వారం శ్రావణ మాస ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

**చక్రాయపేట,ఆగుష్టు 23,ప్రభాతవార్త:**
మూడోవార శ్రావణమాస ఉత్సవాల సందర్బంగా గండిక్షేత్రంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని ఆలయ ఈవో వెంకటసుబ్బయ్య ఆర్కే వేల్యూ ఎస్ఐ భాస్కర్ రెడ్డి ఏర్పాట్లపై దృష్టి పెట్టారు.మొదటి రెండు వారాల కంటే మూడో వారం శ్రవణమాసం ఉత్సవాలకు రాయలసీమ నలుమూలల నుండి భక్తులు వస్తారని వారికి ఎటువంటి ఇబ్బందులు కలకుండా ఫ్రీ లైన్లు తాగునీటి సమస్య అన్నదానం ఏర్పాట్లపై దృష్టి పెట్టారు అలాగే ఎస్సై భాస్కర్ రెడ్డి ఆలయ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తమ సిబ్బంది నీ ఏర్పాటు చేశారు మూడో వారం గండి క్షేత్రంలో భక్తులతో రద్దీగా ఉంటుందని కదిరి రాయచోటి నుండి వచ్చే బస్సులను అద్దాలమారి క్రాస్ వద్దనే ఆర్టీసీ బస్సులు నిలుపుతారని వేంపల్లి నుంచి వచ్చే బస్సులను వీరన్నగట్టపల్లె క్రాస్ వద్ద నిలపడం జరుగుతుందని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో గండి చైర్మన్ కృష్ణ తేజ రవిచంద్ర రెడ్డి ఆలయ ప్రధాన అర్చకులు కేసరి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

**రామాపురం, ఆగస్టు 23, ప్రభాతవార్త:**



రాష్ట్ర డిప్యూటీ సీఎం పంచాయతీరాజ్ శాఖామంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు గ్రామాల అభివృద్ధిపై గ్రామ సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు అన్నారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామ సచివాలయాల్లో శుక్రవారం ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో ప్రత్యేక అధికారుల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. చిట్లూరు గ్రామంలో మండల ప్రత్యేక అధికారి నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభలో అవసరమైన పనులకు సంబంధించి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి ఆయా గ్రామాల సభలో తీర్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీఓ సురేందర్‌రెడ్డి, టి.ఎ.నాగేశ్వర్‌రెడ్డి, వీఆర్వో వెంకట సుబ్బయ్య, సచివాలయ సిబ్బంది గ్రామ నాయకులు సురేందర్‌రెడ్డి, దేవదర్శన్‌రెడ్డి, బసిరెడ్డి వెంకటరామిరెడ్డి, వెంకటరమణ, లక్ష్మయ్య, రామకృష్ణగౌడ్, ఓబులేసు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాల విద్యార్థుల స్వాగత మహోత్సవం..

**పెండ్లిమర్రి, ఆగస్టు 23, ప్రభాతవార్త:**



పెండ్లిమర్రి జూనియర్ కళాశాలలో సీనియర్ విద్యార్థులు, జూనియర్ విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్‌డే నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పుత్రా కృష్ణచైతన్యరెడ్డిని కోలాటం చేస్తూ పూలు జల్లుతూ స్వాగతం పలికారు. ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రుల పేరు మీద ఒక వృక్షాన్ని నాటాలని సందేశమిచ్చారు. వృక్షో రక్షిత: అంటూ పుత్రా కృష్ణచైతన్యరెడ్డి మామిడి, కొబ్బరి మొక్కలు నాటారు. కళాశాల విద్యార్థులందరిని ఎంతో క్రమశిక్షణతో విద్యాబోధనతో పాటు ఇలాంటి అనేక కార్యక్రమాలకు ప్రోత్సహిస్తున్న సిబ్బందిని అభినందించారు. స్వాగత మహోత్సవంలో విద్యార్థులు ప్రసంగిస్తూ సాంస్కృతిక కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కళాశాల ప్రిన్సిపల్ ఇందిరా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాజగోపాల్, కళాశాల అధ్యాపకులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ విద్యా జోన్-4 ఆర్‌టీడీఎస్ రవి విద్యార్థులను చక్కగా చదివి ఉత్తీర్ణులు కావాలని సూచించారు. కడప డీవీఈవో ఆర్ 10 వెంకట సుబ్బయ్య, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## రెడ్డి పల్లి గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరిస్తాం



**పుల్లంపేట, ఆగస్టు 23, ప్రభాతవార్త:**
మండలం రెడ్డి పల్లె గ్రామ పంచాయతీలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని రెడ్డిపల్లి మాజీ సర్పంచ్ రొంపిచర్ల మల్లేశ్వరి లిఖిత పూర్వకంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా రెడ్డిపల్లిలో ఆర్వో వాటర్ ప్లాంట్, సిమెంట్ రోడ్డు మొదలగు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించాలని కోరారు. రెడ్డి పల్లి గ్రామ అభివృద్ధికి ఖచ్చితంగా సహకరిస్తామని అన్నారు. ఈ సందర్భంగా మైసూరివారిపల్లె బహిరంగ సభ ముగించుకొని పులపత్తూరు వెళుతుండగా మార్గ మధ్యలో రెడ్డిపల్లి దగ్గర భారీ సంఖ్యలో అభిమానులు డిప్యూటీ సీఎంకు హారతితో గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రొంపిచర్ల మురళీ, సాయి, సుధీర్, ప్రతాప్, మనోజ్, సుమన్, భాను మోహన్‌తో పాటు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.




## గ్రామసభలు విజయవంతం

**కలికిరి, ఆగస్టు 23, ప్రభాతవార్త:**



కలికిరి మండలంలో శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఒకే రోజు అన్ని పంచాయతీల్లో సర్పంచుల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి మహాత్మ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు సక్రమంగా సద్వినియోగం అయ్యేలా గ్రామ సభలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కలికిరి మండలంలో ఎంపీడీవో గంగయ్య, ఈవోఆర్డీ పరశురాం పర్యవేక్షణలో పంచాయతీ సర్పంచుల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్బంగా పంచాయతీలో రైతులు కూలీల సమక్షంలో ఉపాధి పనులు ఎంపిక చేయడం జరిగింది. కలికిరి పంచాయతీలో ఉప సర్పంచ్ ఎల్లయ్య ఆధ్వర్యంలో గ్రామ సభ జరగ్గా, మర్రికుంటపల్లెలో స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్ అధ్యక్షతన, గుండ్లూరులో సర్పంచ్ సైఫుల్లా అధ్యక్షతన, పత్తేగడ పంచాయతీలో సర్పంచ్ రెడ్డమ్మ అధ్యక్షతన గ్రామ సభలు జరిగాయి. మర్రికుంటపల్లె సర్పంచ్ ఎ.రెడ్డిరామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రైతుల సంక్షేమమే ధ్యేయం, ప్రజల సంక్షేమం కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పీలేరు నియోజకవర్గంలో ఇప్పటికే ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి చెందిందన్నారు. ఎమ్మెల్యే సహకారంతో మర్రికుంటపల్లె పంచాయతీని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని అందుకు స్థానిక ప్రజా ప్రతినిధులు, వార్డుమెంబర్లు సహకరించాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గాయత్రి, ఎంపీటీసీ చిరంజీవమ్మ, తెదేపా సీనియర్ నాయకులు చిన్న రెడ్డయ్య, మండల తెలుగు యువత అధ్యక్షులు శ్రీనివాసులు, టీడీపీ సీనియర్ నాయకులు వెంకటపతి, టీడీపీ యువ నాయకులు ఒంబాల రెడ్డయ్య, మహేష్, సీనియర్ నాయకులు శంకరయ్య, కొటాల చల్లయ్య, ఎంపీడీవో గంగయ్య, ఈవోఆర్డీ పరశురాం, ఉపాధి హామీ టీఏలు మనోహర్, బొజ్జమ్మ, డిజిటల్ అసిస్టెంట్ పాపయ్య, సచివాలయ సిబ్బంది, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఐటీలో ప్రారంభమైన ఉచిత సైబర్ సెక్యూరిటీ శిక్షణా తరగతులు

**ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 23, ప్రభాతవార్త:**
సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ ఫైనలియర్ బీటెక్ విద్యార్థులకు ఐసీటీ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థి సాధికారతలో భాగంగా హనీవెల్ సైబర్ సెక్యూరిటీ సంస్థచే ఉచిత సైబర్ సెక్యూరిటీ శిక్షణ తరగతులను ప్రారంభించడం జరిగిందని ప్రిన్సిపల్ డా.పాండురంగన్ రవి తెలిపారు. కార్యక్రమాన్ని ఏపీ స్టేట్ హెడ్ ఐసీటీ అకాడమి ఎస్.దినకర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి డిజిటల్ ప్రపంచంలో సుస్థిరత, భద్రత, డెవలప్‌మెంట్ కోసం ప్రతి కంపెనీ వ్యూహంలో సైబర్ సెక్యూరిటీ ఒక ముఖ్యమైన భాగంగా మారిందని తెలిపారు. ఛైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీర కల్యాణ్‌రెడ్డి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో ఐసీటీ అకాడమీ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రశాంత్, సైబర్ ఇన్‌స్పెక్టర్ ఉమర్ అబ్దుల్‌ఖాన్, వైస్ ప్రిన్సిపల్ డా.ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి, హెచ్ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నలుగురు జూదరులు అరెస్ట్

**దువ్వూరు, ఆగస్టు 23, ప్రభాతార్త:**
మండల పరిధిలోని పెద్ద సింగనపల్లె గ్రామ పొలాల్లో జూదం ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 4900రూపాయల నగదును, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. రాబడిన సమాచారం మేరకు పోలీస్ సిబ్బందిచే దాడి చేశామన్నారు. అరెస్ట్ చేసిన వారిని త్వరలో మైదుకూరు కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## బద్వేలు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన నరసింహా రెడ్డి

**బద్వేలు, ఆగస్టు 23 (ప్రభాతవార్త):**



బద్వేలు మున్సిపల్ కమిషనర్‌గా నరసింహారెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. బద్వేలు కమిషనర్‌గా పనిచేసిన క్రిష్ణ బదిలీ కావడంతో నరసింహారెడ్డి పులివెందుల మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ ఎన్నికల సమయంలో చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో విధులు నిర్వహించారు. అక్కడి నుంచి బదేవ్లుకు బదిలీ కావడంతో శుక్రవారం నరసింహారెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని పేర్కొన్నారు

## ప్రత్యేక అలంకరణలో దుర్గామాత అమ్మవారు

**బద్వేలు, ఆగస్టు 23 (ప్రభాతవార్త):**



పట్టణంలోని పోలీసుస్టేషన్ ఆవరణలో ఉన్న దుర్గామాత అమ్మవారు భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. శ్రావణమాసం మూడవ శుక్రవారం కావడంతో అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావడంతో అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు కనువిందు కలిగేలా చేశారు. కోరిన కోర్కెలు తీర్చే దుర్గామాత అమ్మవారికి పూజలు నిర్వహించేందుకు పట్టణంలోని వేలాదిమంది భక్తులు తరలివచ్చి ఉదయం నుంచి రాత్రి వరకు పూజలు చేపట్టారు. వీటితోపాటు అమ్మవారి ఆలయంలో మహిళలు వాయినాలు ఇచ్చుకున్నారు. వచ్చిన భక్తులు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందించారు.

## గ్రామసభ కాదు ఎన్డీఏ కూటమి కార్యకర్తల ఆత్మీయ సభ

**నందలూరు,ఆగష్టు 23,ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నటువంటి గ్రామసభ కార్యక్రమం పూర్తిగా ఎన్డీఏ కూటమి కార్యకర్తల ఆత్మీయ సభగా నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీలో జరిగింది సామాన్య ప్రజలు లేక గ్రామ సభ వెలవెలబోయింది..ప్రజలు ఎవరూ రాకపోవడంతో ఎన్డీఏ కూటమి కార్యకర్తలు,సచివాలయ ఉద్యోగులు, ఏఎన్ఎం లు మరియు ఇతర పంచాయతీ సిబ్బందితో తూతూ మంత్రంగా గ్రామసభ కార్యక్రమం నిర్వహించారు.ప్రజా సమస్యలకు పరిష్కార వేదికగా గ్రామసభ నిర్వహణ ఉండేలా తప్ప ఏదో ఫోటోల కోసం పబ్లిసిటీ పిచ్చి కోసం సభ జరిపించడం తగదు..రాష్ట్ర ప్రభుత్వం పై నమ్మకం లేకనే సామాన్య ప్రజలు ఎవరు ఈ యొక్క గ్రామసభ కార్యక్రమానికి హాజరు కాలేకపోయారు. ఎందుకంటే ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం సూపర్ సిక్స్ పథకాలు ఇంతవరకు ఏ ఒక్కటీ అమలు కావట్లేదు కాబట్టి పూర్తిగా అట్టర్ ఫ్లాప్ అయిన నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీలోని గ్రమసభ కార్యక్రమం.

### గ్రామ స్వరాజ్యం సాధించాలంటే

## పంచాయతీ రాజ్ వ్యవస్థ కీలకం-ఎంపీడీఓ

**చాపాడు, ఆగస్టు 23, ప్రభాతవార్త:**



మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధించాలంటే పంచాయతీ రాజ్ వ్యవస్థలో గ్రామ పంచాయతీలు అత్యంత కీలకమని ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు తెలిపారు. స్వర్ణ గ్రామ పంచాయతీ అమల్లో భాగంగా మండలంలోని 22 గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించారు. ఇందులో భద్రపల్లె, అన్నవరం పంచాయతీలలో మాట్లాడుతూ ఉపాధి కూలీల హక్కులు, రాజీలేని అంశాలు, ఉపాధి హామీల చేపట్టే పనులు, సామాజిక తనిఖీ ప్రాముఖ్యత వంటి అంశాలు గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించి తద్వారా నాణ్యమైన పనుల ప్రణాళికను రూపొందించడానికి గ్రామ సభలు వేదిక కానున్నట్లు తెలిపారు. 22గ్రామ పంచాయతీలు యందు ఆయా గ్రామాల సర్పంచ్‌లు అధ్యక్షత వహించగా పంచాయతీ కార్యదర్శులు ఆర్గనైజింగ్ బాధ్యతలు చేపట్టారు. చియ్యపాడు గ్రామం నందు ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జగదీశ్వర్ రెడ్డి, ఉపాధి హామీ పథకం యొక్క ముఖ్యమైన అంశాలను ప్రజలకు క్లుప్తంగా వివరించారు. గ్రామ సభల నందు ఆయా గ్రామాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్లు అరెస్ట్

**ముద్దనూరు, ఆగస్టు 23, ప్రభాతవార్త:**
ముద్దనూరు మండలంలోని కొత్తపల్లె మరియు సునుగురాళ్ల పల్లెకు చెందిన వ్యక్తులు కొత్తపల్లి గ్రామంలో కంపచెట్లలో శుక్రవారం నాడు ఆరుగురు వ్యక్తులు జూదం ఆడుతున్నట్లు సీఐ దస్తగిరికి సమాచారం రాగా సీఐ తమ తోటి సిబ్బందితో కలిసి జూదం ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు వారి వద్ద నుండి 52పేక ముక్కలు, 21050 నగదు స్వాధీనం పరుచుకొని ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సీఐ పత్రికా విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో మట్కా, జూదం, అక్రమ ఇసుక రవాణా, అక్రమ మద్యం బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన అసాంఘీక కార్యకలాపాలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

## ఉర్దూ కళాశాల అభివృద్ధికై కలెక్టర్‌కు వినతి

**ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 23, ప్రభాతవార్త**



ప్రొద్దుటూరులోని ఉర్దూ జూనియర్ కళాశాల అభివృద్ధి విశమంపై ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిలర్లు, మైనార్టీ నాయకులు మరియు కార్మిక నేస్తం జిల్లా అధ్యక్షుడు చింతకుంట కుతుబుద్దీన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్నుఉ కలిసి కాలేజీలో ఉన్న ప్రధాన సమస్యలైన తరగతి గదులు, ల్యాబ్ రూము, బాత్రూమ్స్ మరియు బాటనీ, ఫిజిక్స్ అధ్యాపకుల కొరతపై కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. సదరు సమస్యను కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారులను సిఫారసు చేసి సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిలర్లు గాజుల శివజ్యోతి, వడ్ల ఇబ్రహీం, మహినూర్, మైనారిటీ నాయకులు ఆర్టిసి బాబా, నూరి, ఎస్ఎం హర్షద్, ఫిట్టర్ రఫీ,పాలగిరి బాబా, మస్తాన్, ముస్లిం ఐక్య వేదిక గౌరవ అధ్యక్షులు ఖాజా మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీలతోనే గ్రామం అభివృద్ధి

**దువ్వూరు, ఆగస్టు 23, ప్రభాతవార్త:**



పంచాయతీరాజ్ వ్యవస్థలో గ్రామ పంచాయతీలు అత్యంత కీలకమైనవి అని ప్రజల భాగస్వామ్యంతో గ్రామ పంచాయతీ అబివృద్ధి చెందుతాయని ఎంపీడీఓ శివప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని 23గ్రామ పంచాయతీల్లో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి చేపట్టాల్సిన పనుల గుర్తింపు కోసం గ్రామ సభలు నిర్వహించామన్నారు. ఈ సభలో ఎంపీడీఓ శివప్రసాద్, ఏపీఓ వసంతకుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలు, అప్పులు, రాజీలేని అంశాలు, ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులు, సామాజిక తనిఖీ ప్రాముఖ్యతను గురించి వివరించారు. ఈ సభలో ప్రతి కూలికి 100రోజుల పని కల్పించడము వంటి అంశాలపై చర్చించారు. అనంతరం ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనులను చర్చించి నిర్ణయం తీసుకున్నారు. దువ్వూరు గ్రామ సభలో వివిధ రకాల అభివృద్ధి పనులకు గాను కోటి రూపాయలతో అభివృద్ధి పనులను ఆమోదించారు. వీటిని జిల్లా అధికారులకు పంపుతామని తెలిపారు. ఈ సభలో సర్పంచ్ చెంద్రాయుడు, పంచాయతీ కార్యదర్శి వీరారెడ్డి, వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## తెలుగు ప్రజల హృదయాలలో చిరస్మరణీయుడు టంగుటూరి

**బద్వేలు, ఆగస్టు 23 (ప్రభాతవార్త):**



తెలుగు ప్రజల హృదయాలలో చిరస్మరణీయుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వెంకట సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కళాశాల ఎన్ఎస్ఎస్ 1,2 యూనిట్ల ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రకాశం పంతులు ఈ తరం రాజకీయ నాయకులకు ఆదర్శ ప్రాయుడని ఆయన జీవితం త్యాగామయమని, ఆయన చరిత్ర ప్రతి విద్యార్థి చదవదగిన విలువైన పాఠ్యగ్రంథమని తెలిపారు. చిన్నతనంలోనే అనేక కష్టనష్టాలకు ఒర్చుకుని బారిష్టర్ చదవడంతో పాటు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని ఎన్నోసార్లు జైలుకెళ్లి యావత్ తెలుగు ప్రజల హృదయాలలో చిరస్మరణీయుడుగా నిలిచిన మహానేత ప్రకాశం పంతులు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పథక సమన్వయకర్త డాక్టర్ ఎం. దొరస్వామినాయక్, సీ.హెచ్.ఈశ్వరయ్య, మహేష్, హరిహరనాథరెడ్డి, జి.వి.రాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రిపోర్టర్స్ కావలెను
తెలుగు దిన పత్రిక రంగంలో అందరి మన్ననలు పొందిన పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.
కావలసిన సెంటర్లు
అన్నమయ్య జిల్లా: సుండుపల్లె, వాయల్పాడు, కలకడ, మొలకలచెరువు
కడప జిల్లా: ఒంటిమిట్ట, కమలాపురం, చెన్నూరు, యర్రగుంట్ల, అట్లూరు, సిద్ధవటం, బద్వేలు రూరల్, కలసపాడు
మీ పూర్తి బయోడేటాతో 24వ తేది శనివారం క్రింది చిరునామాలో సంప్రదించగలరు
వార్త కార్యాలయం, డోర్ నెం. 1-2237, హౌసింగ్ బోర్డు కాలని, విశ్వేశ్వరయ్య సర్కిల్ దగ్గర, రైల్వేస్టేషన్ రోడ్డు, కడప.
సెల్ నెం. 9848787289, 8919566086